హైదరాబాద్
7-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 196

# క్రైమ్ మిర్రర్

THE
Voice of Anti Corruption
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## రేవంత్‌కు చెక్ పెట్టేందుకు కేసీఆర్ మాస్టర్ ప్లాన్?

### రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

- బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ కసరత్తు
- హైదరాబాద్ సీటుపై బీసీ అభ్యర్థి వైపు మొగ్గు
- పట్టభద్రుల ఓట్లపై పార్టీల ఫోకస్



**హైదరాబాద్, అక్టోబర్ 5:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలైంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మరో కీలక రాజకీయ పరీక్షగా మారుతున్నాయి. రెండు స్థానాలకు ఎన్నికల ప్రక్రియ మొదలుకావడంతో.. అధికార పార్టీ ముందుగానే అభ్యర్థులను ప్రకటించి రంగంలోకి దిగింది.

ఇక బీఆర్ఎస్ కూడా ఆలస్యం చేయకుండా తన వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సామాజిక సమీకరణాలు, పట్టభద్ర ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి బలంపై పార్టీ నాయకత్వం దృష్టి పెట్టింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ రెండు పేర్లకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. దీంతో అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ తన నిర్ణయాన్ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ మాత్రం అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ రెండు స్థానాల్లోనూ 'రెడ్డి' సామాజిక వర్గానికి చెందిన నేతలను బరిలోకి దించగా.. మరోవైపు హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం విషయంలో బీసీ అభ్యర్థిని పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

- మిగతా 3వ పేజీలో

## వన్‌వేతో తగ్గిన ట్రాఫిక్..

### కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక ఇదే రూల్!

- కేబీఆర్ పార్క్ దగ్గర ట్రాఫిక్‌కు కొత్త రూట్.. రూ.400 కోట్లు మిగిల్చిన నిర్ణయం
- కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానాన్ని కొనసాగించనున్న జీహెచ్ఎంసీ
- ప్రయోగాత్మక విధానంతో రద్దీ తగ్గడంతో శాశ్వతంగా అమలు
- నాగార్జున సర్కిల్--చెక్‌పోస్ట్ మధ్య ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జి
- మారిన ప్రణాళికతో దాదాపు రూ.400 కోట్ల ప్రజాధనం ఆదా



## "సర్"పై మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు..

- ఇక రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- 90 లక్షల ఓట్ల వ్యవహారం.. తెలంగాణలో కాంగ్రెస్ భారీ పోరాటం
- తెలంగాణలో SIR ప్రక్రియపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది
- 90 లక్షల ఓట్లను తొలగించారంటూ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణ
- అక్టోబర్ 6, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు టీపీసీసీ పిలుపు
- అక్టోబర్ 8న లోక్‌భవన్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడి

- మిగతా 2వ పేజీలో

## లండన్-షికాగో విమానంలో ఎమర్జెన్సీ..

- నిమిషాల్లో 28,000 అడుగులు కిందకు
- బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ఎమర్జెన్సీ
- ఐర్లాండ్ మీదుగా వెళుతుండగా ఘటన
- 7700 ఎమర్జెన్సీ కోడ్ యాక్టివేట్
- విమానాన్ని 9,000 అడుగులకు దించిన వైనం
- కారణం ఇంకా వెల్లడించని బ్రిటిష్ ఎయిర్‌వేస్




2లో



## రేవంత్ సర్కార్ కీలక ప్లాన్..

### తెలంగాణలో 87 యంగ్ ఇండియా స్కూళ్లు

- పిల్లల చదువుకు కొత్త క్యాంపస్‌లు.. యంగ్ ఇండియా స్కూళ్లపై సర్కార్ స్పీడ్
- 2027 డిసెంబర్ నాటికి 67 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం
- 2028 జూన్ నాటికి 87 పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం
- ఒక్కో స్కూల్‌కు సుమారు 26 ఎకరాలు.. ఆధునిక వసతులతో భారీ క్యాంపస్‌లు
- ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌ల కోసం ప్రత్యేక విధానం

హైదరాబాద్, అక్టోబరు 5: ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా

2లో



## ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తోంది?

### సన్నబియ్యంపై హరీశ్ రావు ఫైర్

- నాలుగు నెలల్లో సన్నబియ్యం ధర 25 శాతం పెరిగిందని హరీశ్‌రావు వ్యాఖ్య
- రైతు నుంచి వినియోగదారుడి వరకు ధరల వ్యవస్థపై ప్రశ్నలు
- ఉల్లి, వెల్లుల్లి, నూనె, పప్పుల ధరలపైనా ప్రభుత్వాన్ని నిలదీత
- అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్‌పై తక్షణ తనిఖీలు చేయాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 5: నెలవారీ ఇంటి బడ్జెట్‌ను నిత్యావసరాల ధరలు గట్టిగానే ప్రభావితం చేస్తున్నాయన్న చర్చ మధ్య బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మరోసారి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ముఖ్యంగా సన్నబియ్యం ధరల పెరుగుదలను ప్రస్తావిస్తూ.. నాలుగు నెలల వ్యవధిలో ధరలు 25 శాతం మేర పెరిగాయని

2లో



3లో

## "మేం ఆమోదించలేదు"

- ఫారమ్-6లో మార్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వలేదని సీజేఐ స్పష్టీకరణ
- అసలు మార్పులు జరిగాయా? అయితే వాటిని ఎవరు చేశారనే దానిపై పరిశీలన
- కొత్త ఓటర్ల కోసం అదనపు డిక్లరేషన్ జత చేసినట్లు ఈసీ వివరణ
- సీఈసీ నిర్ణయాలపై వచ్చిన ఇతర ఆరోపణలపైనా కోర్టులో విచారణ

## ఇంటి ముందుకే తాగునీరు.. సీమ నుంచి చంద్రబాబు బిగ్ ప్లాన్

- రూ.30,156 కోట్ల పథకాన్ని ప్రారంభించిన చంద్రబాబు, పవన్
- రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార'కు శ్రీకారం
- 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు
- 13,075 ట్యాంకులు.. 77,243 కి.మీ. మేర పైపులైన్లు
- రాయలసీమ అభివృద్ధిపై చంద్రబాబు కీలక ప్రకటనలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



## రామప్ప సమీపంలో బొగ్గు తవ్వకాలపై రగడ.. కేటీఆర్ ఫైర్

3లో

- రామప్ప చుట్టూ మైనింగ్ కలకలం.. కేటీఆర్ కీలక హెచ్చరిక
- రామప్పకు సమీపంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ గనిపై అభ్యంతరం
- తవ్వకాలు, పేలుళ్లతో ఆలయం, చెరువుకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని కేటీఆర్ ఆందోళన
- ప్రతిపాదనను ఉపసంహరించుకోకపోతే భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరిక
- యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాన్ని కాపాడాలని బీఆర్ఎస్ డిమాండ్




# “సర్”పై మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు..

ఢిల్లీ, అక్టోబరు 5: తెలంగాణ ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పులపై కాంగ్రెస్ తన ఆందోళనను మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) పేరుతో రాష్ట్రంలో భారీ సంఖ్యలో ఓట్లను తొలగించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తన వాదన ప్రకారం దాదాపు 90 లక్షల ఓట్లు జాబితా నుంచి మాయమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రానున్న రెండు నెలల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని ఢిల్లీలో జరిగిన సమావేశంలో నిర్ణయించినట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేకపోయిన వారు తమ హక్కును



కాపాడుకునేలా ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలకు కాంగ్రెస్ తరఫున లేఖలు పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాల్సిందేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారని తెలిపారు. SIRపై ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగిస్తామని మహేశ్ గౌడ్ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడితో ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రస్థాయిలోనూ నిరసనలను ముమ్మరం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అక్టోబర్ 6, 7 తేదీల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ధర్నాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. అక్టోబర్ 8న లోక్‌భవన్ ఎదుట ప్రత్యేక ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు.



# రామప్ప సమీపంలో బొగ్గు తవ్వకాలపై రగడ.. కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబరు 5: కాకతీయుల శిల్పకళకు ప్రతీకగా నిలిచిన రామప్ప దేవాలయం చుట్టూ మైనింగ్ అంశం రాజకీయ వేడి పెంచుతోంది. ఆలయానికి సమీపంలో ప్రతిపాదిస్తున్న ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని వల్ల చారిత్రక కట్టడంపై ప్రభావం పడే ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఉద్యమానికి సిద్ధమవుతామని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కేటీఆర్.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సహజ వనరుల వెలికితీత పేరుతో వారసత్వ సంపదను ప్రమాదంలోకి నెడుతోందని విమర్శించారు. రామప్ప ప్రాంతంలో భారీ స్థాయిలో భూగర్భ తవ్వకాలు చేపట్టడం, బొగ్గు కోసం పేలుళ్లు నిర్వహించడం వల్ల అక్కడి పరిస్థితులపై ప్రభావం పడొచ్చని ఆయన పేర్కొన్నారు. రామప్ప దేవాలయంతో పాటు దానికి ఆనుకుని ఉన్న రామప్ప చెరువు విషయంలోనూ జాగ్రత్త అవసరమని కేటీఆర్ అన్నారు. ఈ కట్టడం తెలంగాణ చరిత్ర, శిల్పకళకు ప్రత్యేక గుర్తింపుగా ఉండటంతో పాటు 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు సంపాదించిందని గుర్తుచేశారు. మైనింగ్ ప్రతిపాదన వల్ల వారసత్వ ప్రాంతానికి ఇబ్బంది కలిగే పరిస్థితిని బీఆర్ఎస్ అంగీకరించబోదని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రామప్ప పరిరక్షణ కోసం పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అయితే, ఈ అంశంపై సింగరేణి సంస్థ కూడా స్పందించింది. శాస్త్రీయ అధ్యయనాలు, పురావస్తు శాఖతో పాటు నిపుణుల నివేదికలను పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని, రామప్ప ఆలయానికి ఎలాంటి నష్టం కలిగించే చర్యలు చేపట్టబోమని సంస్థ స్పష్టం చేసింది.

# లండన్-షికాగో విమానంలో ఎమర్జెన్సీ..

లండన్ నుంచి అమెరికాలోని షికాగోకు వెళుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఎమర్జెన్సీ ప్రకటించింది. వెంటనే పైలట్లు 7700 ఎమర్జెన్సీ కోడ్‌ను యాక్టివేట్ చేసి.. విమానాన్ని 37,000 నుంచి సుమారు 9,000 అడుగుల కిందకు దించారు. నిమిషాల్లో ఏకంగా 28,000 అడుగులు కిందకు రావడం గమనార్హం. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం బీఏ295 అట్లాంటిక్ మీదుగా ప్రయాణిస్తుండగా ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. బోయింగ్ విమానం ఒక్కసారిగా కిందికి దిగడం, ఎమర్జెన్సీ కోడ్ పంపడంతో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. 7700 కోడ్‌ను విమాన సిబ్బంది సాధారణ అత్యవసర పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఈ కోడ్ వచ్చినప్పుడు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి విమానానికి ప్రాధాన్య సహాయం అందుతుంది. అయితే అత్యవసర పరిస్థితికి కారణం ఏంటో ఈ కోడ్ ద్వారా తెలియదు. సాంకేతిక సమస్య, ప్రయాణికుడికి వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఇతర కారణాలతోనూ ఈ కోడ్‌ను ఉపయోగించవచ్చు. బీఏ295 ఘటనకు అసలు కారణాన్ని బ్రిటిష్ ఎయిర్‌వేస్ వెంటనే వెల్లడించలేదు. విమానం పరిస్థితి, ఆ తర్వాతి ప్రయాణ మార్గంపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో జరిగిన ఘటన తర్వాత మరో విమానం ఎమర్జెన్సీ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అయితే బీఏ295 ఘటనకు, ఫ్లైదుబాయ్ ఘటనకు సంబంధం ఉన్నట్లు ప్రస్తుతానికి ఆధారాలు లేవు. సెప్టెంబర్ 30న ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో గొడవ జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో 7700తో పాటు 7500 కోడ్‌ను కూడా యాక్టివేట్ చేశారు. 7500 కోడ్‌ను విమానంలో చట్టవిరుద్ధ జోక్యం లేదా హైజాక్ పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఆ విమానం సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లి సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనపై యూఏఈ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# ఇంటి ముందుకే తాగునీరు.. సీమ నుంచి చంద్రబాబు బిగ్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రొద్దుటూరు, అక్టోబర్ 5: ఒకప్పుడు తాగునీటి కోసం ఎదురుచూసిన గ్రామీణ కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికను ముందుకు తీసుకొచ్చింది. ఇంటి గుమ్మం వద్దకే సురక్షితమైన నీరు చేరేలా రూ.30,156 కోట్లతో చేపట్టిన ‘జల్ జీవన్ మిషన్ 2.0--అమరజీవి జలధార’కు సోమవారం ప్రొద్దుటూరు వేదికగా శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొత్తపల్లిలో ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించారు.

**27 లక్షల ఇళ్లకు కొత్త కనెక్షన్లు**

ఈ ప్రాజెక్టు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో మరో 27 లక్షల కుటుంబాలకు కుళాయి సదుపాయం అందనుంది. ఇప్పటికే రాష్ట్రంలో 62 లక్షల కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఉన్న నేపథ్యంలో కొత్తగా చేపట్టే పనులు పూర్తయితే మరింత విస్తృతంగా ఇంటింటికీ నీటి సరఫరా అందుబాటులోకి రానుంది.

**వేల కిలోమీటర్ల పైపులైన్.. భారీ మౌలిక వసతులు**

పథకంలో భాగంగా 13,075 ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించడంతో పాటు 77,243 కిలోమీటర్ల మేర పైపులైన్లను ఏర్పాటు చేయనున్నారు. నీటి సరఫరా వ్యవస్థలను విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది.

**‘రాయలసీమ రైజింగ్’పై చంద్రబాబు మాట**

ప్రొద్దుటూరులో జరిగిన సభలో చంద్రబాబు రాయలసీమ భవిష్యత్తుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాంత అభివృద్ధి విషయంలో వెనకడుగు ఉండదని చెప్పారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేసి సీమకు కొత్త ఆర్థిక అవకాశాలు తీసుకొస్తామని ప్రకటించారు. రాయలసీమలో తయారయ్యే ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరే స్థాయికి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఫైటర్ జెట్ల తయారీ కూడా రాయలసీమలోనే జరిగే పరిస్థితి వస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం



చేశారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని మరోసారి తెలిపారు.

**ప్రతిపక్షంపై విమర్శలు**

గత ప్రభుత్వ పాలనను ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పుతో సమాధానం చెప్పారని అన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసు, మద్యం వ్యవహారం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష నేతపై ఆరోపణలు చేశారు. కుట్రలు, తప్పుడు ప్రచారంతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రతిపక్ష హోదా కోరడం సరికాదని వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు చంద్రబాబు చేసిన రాజకీయ విమర్శలుగా పరిగణించాల్సి ఉంటుంది.

**‘ట్రిపుల్ ఇంజిన్’తో అభివృద్ధి వేగం**

కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల్లో ఒకే కూటమి అధికారంలో ఉంటే అభివృద్ధి పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లవచ్చని చంద్రబాబు అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తోంది?

ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమీక్ష జరపాలని కోరారు. పంట దిగుబడి రికార్డు స్థాయిలో సాధించామని ప్రభుత్వం చెబుతున్నప్పుడు మార్కెట్‌లో బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయనే అంశాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఉత్పత్తి పెరిగితే వినియోగదారులకు ధర తగ్గాలి కదా అని ఆయన తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం ప్రభావంపైనా ఆయన సందేహాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం నాణ్యత, ప్రజల వినియోగంపై సమీక్ష అవసరమని అన్నారు. రైతుకు పంటకు సరైన ప్రతిఫలం దక్కడం లేదని, మరోవైపు వినియోగదారులు అధిక ధర చెల్లించాల్సి వస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. మధ్యవర్తుల వ్యవహారంపైనా హరీశ్‌రావు ఆరోపణలు చేశారు. రైతులకు ఎంఎస్‌పీ కింద లభించే ధరతో పోలిస్తే మధ్య దళారులు క్వింటాల్‌కు రూ.8 వేలకుపైగా సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. రైతు, వినియోగదారుడి మధ్య ఉన్న వ్యవస్థపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. బియ్యంతో పాటు ఇతర వంటింటి సరుకుల ధరలను కూడా ఆయన ప్రస్తావించారు. ఉల్లి కిలో రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 వరకు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సాధారణ కుటుంబాలపై అదనపు భారం పడుతోందని అన్నారు. అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్, కృత్రిమ కొరత, అధిక లాభాలపై తనిఖీలు చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో చర్యలు తీసుకుని నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని కోరారు.

# రేవంత్ సర్కార్ కీలక ప్లాన్..

(మొదటి పేజీ తరువాయి)

ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు ఇప్పుడు స్పష్టమైన టైమ్‌లైన్ ఖరారైంది. నిర్మాణ పనులు ఎక్కడెక్కడ ఏ దశలో ఉన్నాయనే అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం.. తొలి దశలో 67 పాఠశాలలను పూర్తి చేయడంపై దృష్టి పెట్టింది. డిసెంబర్ 2027 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించింది. అనంతరం జూన్ 2028 నాటికి సంఖ్యను 87కు తీసుకెళ్లాలని ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ విద్యా సంస్థలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో క్యాంపస్‌కు దాదాపు 26 ఎకరాల స్థలం కేటాయించి, విద్యతో పాటు క్రీడలు, వసతి, ఇతర అవసరాలను ఒకే ప్రాంగణంలో కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి సంబంధించిన పాఠశాలలను ఒకే క్యాంపస్‌లోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. డిజిటల్ తరగతి గదులు, ఆటస్థలాలు, హాస్టళ్లు, సిబ్బంది నివాసాలు, ఆధునిక వంటశాలలు వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే కొన్ని చోట్ల భూసంబంధిత అంశాలు, టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. వీటిని త్వరగా పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిర్ణయించిన గడువులో నిర్మాణాలు పూర్తయ్యేలా క్రమం తప్పకుండా పురోగతిని పరిశీలించాలని సూచించారు. ఇదే సమీక్షలో తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికపైనా చర్చ జరిగింది. ఫ్యూచర్ సిటీలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు లండన్, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీలతో పాటు మరో నాలుగు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు తెలిపారు. వాటికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులు, విద్యా కార్యక్రమాలకు సంబంధించిన విధానాన్ని రూపొందించాలని సీఎస్ సూచించారు. యంగ్ ఇండియా స్కూళ్లతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రీ-ప్రైమరీ విద్య వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ క్యాంపస్‌లు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు చదువుతో పాటు వసతి, క్రీడలు, ఆధునిక విద్యా సౌకర్యాలు ఒకే చోట లభించే అవకాశం ఉంటుంది.

# వన్‌వేతో తగ్గిన ట్రాఫిక్..



హైదరాబాద్, అక్టోబర్ 5: నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం అంటే భారీ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లే అవసరం లేదని కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలైన ప్రయోగం సూచించింది. వన్‌వే మార్గంతో వాహనాల కదలిక సులభం కావడం, రద్దీ తగ్గడం నేపథ్యంలో ఇదే విధానాన్ని ఇక శాశ్వతంగా కొనసాగించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అదే సమయంలో గతంలో ప్రతిపాదించిన కొన్ని భారీ నిర్మాణాలను పక్కన పెట్టడంతో ప్రజాధనంలో సుమారు రూ.400 కోట్లు ఆదా కానున్నాయి.

**ప్రయోగం.. ఇప్పుడు శాశ్వత నిర్ణయం**

కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు కొంతకాలంగా వన్‌వే విధానాన్ని పరీక్షిస్తున్నారు. దీనివల్ల వాహనాల రాకపోకల్లో అంతరాయం తగ్గడంతో పాటు, ఫ్రీ లెఫ్ట్ టర్న్‌ల వల్ల కూడళ్ల వద్ద నిలిచిపోయే పరిస్థితి కూడా తగ్గిందని అధికారులు గుర్తించారు. దీంతో ప్రయోగాత్మకంగా మొదలైన విధానాన్నే కొనసాగించాలని నిర్ణయించారు.

**అక్కడ ఫ్లైఓవర్.. ఇక్కడ అండర్‌పాస్**

మారిన ప్రణాళికలో అవసరమైన ప్రాంతాలకు మాత్రమే నిర్మాణాలను పరిమితం చేయనున్నారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టును ఏడాది వ్యవధిలో పూర్తిచేయాలనే లక్ష్యాన్ని అధికారులు పెట్టుకున్నారు. కేబీఆర్ పార్క్ సమీపంలో మరో అండర్‌పాస్ నిర్మాణం కూడా చేపట్టనున్నారు.

**రూ.1,090 కోట్ల ప్రణాళికలో మార్పులు**

హెచ్-సిటీ కార్యక్రమంలో భాగంగా గతంలో కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల అనేక ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను నిర్మించేందుకు సుమారు రూ.1,090 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే వన్‌వే అమలుతో వచ్చిన ఫలితాలు, కోర్టుకు సంబంధించిన పరిణామాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు ఆ ప్రతిపాదనలను తిరిగి పరిశీలించారు.

**అవసరం ఉన్న చోటే భారీ నిర్మాణాలు**

ప్రతి సమస్యకు భారీ నిర్మాణమే పరిష్కారం కాదన్న విధానంతో ప్రస్తుత ప్రణాళికను సవరించారు. ట్రాఫిక్ నియంత్రణకు తప్పనిసరిగా అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గడమే కాకుండా నగరంలో రవాణా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఈ వివరాలను వెల్లడించారు. వన్‌వే, ఫ్రీ లెఫ్ట్ విధానాల వల్ల ఇప్పటికే ట్రాఫిక్ పరిస్థితిలో మెరుగుదల కనిపించిందని తెలిపారు. అవసరమైన చోట మౌలిక వసతులు కల్పిస్తూ, అనవసర ఖర్చును తగ్గించడమే తాజా ప్రణాళిక లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

# రేవంత్‌కు చెక్ పెట్టేందుకు కేసీఆర్ మాస్టర్ ప్లాన్?

ఈ వ్యూహం ద్వారా పట్టభద్ర ఓటర్లలో విస్తృత మద్దతు కూడగట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్ సీటుపై ఆసక్తికరమైన లెక్కలు మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానం కోసం బీఆర్ఎస్‌లో పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కాసాని వీరేశ్ ముదిరాజ్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా.. నాగేందర్ గౌడ్, రవి యాదవ్ తదితర పేర్లు కూడా పార్టీ పరిశీలనలో ఉన్నట్లు తాజా రాజకీయ సమాచారం చెబుతోంది.

కాసాని వీరేశ్ ముదిరాజ్ పేరు తెరపైకి రావడానికి బీసీ సామాజిక సమీకరణాలు ఒక కారణంగా కనిపిస్తున్నాయి. ఆయన మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కుమారుడు. బీఆర్ఎస్ ఈ స్థానంలో బీసీ అభ్యర్థిని ఎంపిక చేస్తే.. అది కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థికి భిన్నమైన సామాజిక సమీకరణంతో ఎన్నికల బరిలోకి దిగినట్టవుతుంది. అయితే తుది నిర్ణయం మాత్రం పార్టీ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది.

**రాకేష్‌రెడ్డి వైపు బీఆర్ఎస్ చూపు?**

మరోవైపు నల్గొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ నుంచి రాకేష్‌రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. గతంలో ఈ స్థానం నుంచి పోటీ చేసిన అనుభవం ఆయనకు ఉండటంతో.. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో పరిచయం ఉండటం కలిసొచ్చే అంశంగా పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే బీఆర్ఎస్ నాయకత్వం ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించింది. పార్టీ నేతలకు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని సూచించినట్లు సమాచారం. కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో ఆయా ఉమ్మడి జిల్లాల నేతలు పాల్గొని ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.

**కేసీఆర్ వ్యూహం ఏంటి?**

ఇక్కడే అసలు రాజకీయ ఆసక్తి మొదలవుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించి ప్రచారానికి



సంబంధించిన తదుపరి దశకు వెళ్లగా.. బీఆర్ఎస్ మాత్రం అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాలను కీలకంగా చూస్తోంది. రెండు స్థానాల్లోనూ పార్టీకి అనుకూలంగా ఉండే అభ్యర్థులను ఎంపిక చేయడంతో పాటు.. గ్రాడ్యుయేట్ ఓటర్ల సమస్యలను ప్రధాన ప్రచార అంశాలుగా మార్చే అవకాశం ఉంది. ఉద్యోగాలు, నిరుద్యోగం, విద్య, ప్రభుత్వ నియామకాలు, పట్టభద్రుల సమస్యలు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది. అందుకే సాధారణ ఎన్నికల తరహాలో కాకుండా గ్రాడ్యుయేట్ ఓటర్లను ప్రత్యేకంగా టార్గెట్ చేస్తూ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. రెండు నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఓటర్ల నమోదు ప్రక్రియ కూడా కొనసాగుతోంది. నవంబర్ 6 వరకు ఫామ్-18 ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. తుది ఓటర్ల జాబితా డిసెంబర్ 30న వెలువడనుంది.

**కాంగ్రెస్‌కు ఇది ఎందుకు కీలకం?**

అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా రాజకీయంగా ప్రాధాన్యత కలిగినవే. ఇప్పటికే పార్టీ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అయితే అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్‌లోని కొందరు నేతలు, కార్యకర్తల నుంచి అసంతృప్తి వ్యక్తమైనట్లు కూడా వార్తలు వచ్చాయి. ముఖ్యంగా బీసీ, మైనార్టీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం దక్కలేదనే అభ్యంతరాలు కొందరు వ్యక్తం చేసినట్లు సమాచారం. అందుకే బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికపై కూడా ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. కాంగ్రెస్ నిర్ణయానికి ప్రతిస్పందనగా బీఆర్ఎస్ ఎలాంటి సామాజిక సమీకరణాన్ని ఎంచుకుంటుంది? ఎవరిని బరిలోకి దింపుతుంది? అనే అంశాలపై ఉత్కంఠ కొనసాగుతోంది.

**త్వరలోనే క్లారిటీ?**

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. బీఆర్ఎస్ రెండు స్థానాల కోసం పేర్లను పరిశీలిస్తూ కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానంలో బీసీ అభ్యర్థి ఎంపికపై ఆసక్తి నెలకొంది. నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రాకేష్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. తుది నిర్ణయం పార్టీ అధినేత కేసీఆర్ తీసుకునే అవకాశం ఉంది. మొత్తానికి.. రెండు ఎమ్మెల్సీ స్థానాల పోరు ఇప్పుడే వేడెక్కుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించి ముందడుగు వేయగా.. బీఆర్ఎస్ మాత్రం అభ్యర్థుల ఎంపిక ద్వారా ఎలాంటి రాజకీయ లెక్కలు వేయబోతోందన్నది ఆసక్తిగా మారింది. అభ్యర్థుల ప్రకటన తర్వాతే ఈ పోరుకు పూర్తి స్థాయి రాజకీయ రంగు వచ్చే అవకాశం ఉంది. పట్టభద్రుల ఓటు ఎటువైపు మొగ్గుతుంది? ఈ రెండు స్థానాల్లో ఏ పార్టీ తన రాజకీయ బలాన్ని నిరూపించుకుంటుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది.



## రామప్ప సమీపంలో బొగ్గు తవ్వకాలపై రగడ.. కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబరు 5: కాకతీయుల శిల్పకళకు ప్రతీకగా నిలిచిన రామప్ప దేవాలయం చుట్టూ మైనింగ్ అంశం రాజకీయ వేడి పెంచుతోంది. ఆలయానికి సమీపంలో ప్రతిపాదిస్తున్న ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని వల్ల చారిత్రక కట్టడంపై ప్రభావం పడే ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఉద్యమానికి సిద్ధమవుతామని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కేటీఆర్.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సహజ వనరుల వెలికితీత పేరుతో వారసత్వ సంపదను ప్రమాదంలోకి నెడుతోందని విమర్శించారు. రామప్ప ప్రాంతంలో భారీ స్థాయిలో భూగర్భ తవ్వకాలు చేపట్టడం, బొగ్గు కోసం పేలుళ్లు నిర్వహించడం వల్ల అక్కడి పరిస్థితులపై ప్రభావం పడొచ్చని ఆయన పేర్కొన్నారు.రామప్ప దేవాలయంతో పాటు దానికి ఆనుకుని ఉన్న రామప్ప చెరువు విషయంలోనూ జాగ్రత్త అవసరమని కేటీఆర్ అన్నారు. ఈ కట్టడం తెలంగాణ చరిత్ర, శిల్పకళకు ప్రత్యేక గుర్తింపుగా ఉండటంతో పాటు 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు సంపాదించిందని గుర్తుచేశారు. మైనింగ్ ప్రతిపాదన వల్ల వారసత్వ ప్రాంతానికి ఇబ్బంది కలిగే పరిస్థితిని బీఆర్ఎస్ అంగీకరించబోదని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రామప్ప పరిరక్షణ కోసం పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అయితే, ఈ అంశంపై సింగరేణి సంస్థ కూడా స్పందించింది. శాస్త్రీయ అధ్యయనాలు, పురావస్తు శాఖతో పాటు నిపుణుల నివేదికలను పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని, రామప్ప ఆలయానికి ఎలాంటి నష్టం కలిగించే చర్యలు చేపట్టబోమని సంస్థ స్పష్టం చేసింది.



### టిఎంయు(ఏ) ఐ ఎన్ టి యు సి బలపరిచిన టిడబ్ల్యూ యు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ యూనియన్ ఎన్నికల సన్నాహక సమావేశం

**కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తా**

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**

**కూకట్‌పల్లి, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) :** టిఎంయు(ఏ) ఐ ఎన్ టి యు సి బలపరిచిన టిడబ్ల్యూ యు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ యూనియన్ ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం కూకట్ పల్లి బస్ డిపో వద్ద ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ వైస్-ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హాజరై కార్మికులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల ఐక్యతే వారి బలమని, టిడబ్ల్యూ యు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ యూనియన్లను మరింత బలోపేతం చేసి కార్మికుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తున్న యూనియన్ నాయకత్వాన్ని అభినందించిన బండి రమేష్, రాబోయే యూనియన్ ఎన్నికల సన్నాహాల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షులు పట్టోల్ల నాగిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పుష్ప రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డీసీసీ వైస్-ప్రెసిడెంట్ రాఘవేంద్రరావు, టీఎండబ్ల్యూ వ్యవస్థాపకులు ఈ. ఆస్వాదమరెడ్డి, టిడబ్ల్యూ యు అధ్యక్షులు మొగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, బస్ డిపో పర్సన్స్ యూనియన్ నాయకులు, బస్ డిపో నాయకులు, కార్మికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## "మేం ఆమోదించలేదు"

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తి నింపే ఫారమ్-6 చుట్టూ మొదలైన వివాదం ఇప్పుడు సుప్రీంకోర్టు ముందుకు చేరింది. ఈ ఫారమ్‌లో మార్పులు చేసి, వాటికి కోర్టు ఆమోదం ఉందన్న వాదనలపై అత్యున్నత న్యాయస్థానం కీలక స్పష్టత ఇచ్చింది. తాము ఎలాంటి సవరించిన ఫారమ్-6ను ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. కొత్తగా ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన అదనపు డిక్లరేషన్‌ను చేర్చడంపై వివాదం మొదలైంది. ఈ ప్రకటనలో దరఖాస్తుదారుడి పేరు లేదా తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మల పేర్లు గత ఓటర్ల జాబితాలో ఉన్నాయా అనే వివరాలను అనుసంధానించే అంశాలు ఉన్నాయి. ఈ మార్పు చట్టబద్ధంగా ఎలా వచ్చింది? దానికి ఎవరు అనుమతి ఇచ్చారు? అనే ప్రశ్నలు తలెత్తాయి. ఇదే అంశం సుప్రీంకోర్టు విచారణలోనూ ప్రస్తావనకు వచ్చింది.

**"రికార్డులు చూడాలి.. ఎవరు మార్చారో తేల్చాలి"**

విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్.. సవరించిన ఫారమ్-6కు సుప్రీంకోర్టు ఆమోదం లేదని స్పష్టం చేశారు. సంబంధిత రికార్డులు కోర్టు ముందుకు వచ్చిన తర్వాత ఫారమ్‌లో మార్పులు చేసినది ఎవరో పరిశీలిస్తామని తెలిపారు. దీంతో ఇప్పుడు కోర్టు దృష్టి కేవలం ఫారమ్‌లో మార్పు జరిగిందా లేదా అన్నదానిపైనే కాకుండా.. మార్పు జరిగి ఉంటే దాని వెనుక ఉన్న ప్రక్రియ, బాధ్యత ఎవరిది అనే అంశాలపై పడింది.

**ఈసీ వివరణ ఏంటి?**

మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం అసలు ఫారమ్-6ను మార్చలేదని చెబుతోంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అదనపు డిక్లరేషన్‌ను మాత్రమే జత చేశామని ఈసీ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ అదనపు ప్రకటనలో గత ప్రత్యేక సవరణ సమయంలోని ఓటర్ల జాబితాలో దరఖాస్తుదారుడు లేదా వారి తల్లిదండ్రులు/తాత, అమ్మమ్మల వివరాలకు సంబంధించిన సమాచారం కోరుతున్నారు. అయితే ఫారమ్-6 అనేది రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960 కింద ఉండే చట్టబద్ధ పత్రం కావడంతో.. అందులో మార్పులు చేయాలంటే అనుసరించాల్సిన అధికారిక ప్రక్రియ ఏమిటన్నది ఇప్పుడు కీలకంగా మారింది.



**సెప్టెంబర్‌లోనే వివాదం తెరపైకి..**

ఈ అంశాన్ని సెప్టెంబర్ 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే లేవనెత్తారు. ఫారమ్-6లో మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు. తర్వాత ఈ వ్యవహారం రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చకు దారితీసింది. సవరించిన ఫారమ్-6కు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో అనుమతి ఇచ్చిందన్న వాదన కూడా ముందుకు వచ్చింది. అయితే తాజాగా సీజేఐ చేసిన వ్యాఖ్యలతో ఈ అంశంపై మరింత స్పష్టత అవసరమైంది.

ఇదే విచారణలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలను ఇతర ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా తీసుకున్నారన్న ఆరోపణలూ ప్రస్తావనకు వచ్చాయి. గత నెలల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కొన్ని నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో ఈ అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.అయితే ఈ ఆరోపణలపై తుది నిర్ణయానికి రావడానికి ముందు ఎన్నికల సంఘం నుంచి పూర్తి వివరాలు, సంబంధిత రికార్డులు అందాల్సి ఉందని కోర్టు స్పష్టం చేసింది.

## ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**వన్ వార్డ్ ఎవ్రీ డే సమీక్ష సమావేశంలో డిసి చాముండేశ్వరి, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



**కూకట్ పల్లి, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ శంషిగూడ డివిజన్ పరిధిలోని శంషిగూడ వార్డు కార్యాలయంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ) ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ వార్డ్ ఎవ్రీ డే' సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై, శంషిగూడ డివిజన్ పరిధిలో ఉన్న పలు కాలనీలలో ఉన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల గురించి కాలనీల రేసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి, డి.సి చాముండేశ్వరి తో సిఎంసీ పలు విభాగాల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ వన్ వార్డ్ ఎవ్రీ డే కార్యక్రమంలో భాగంగా కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సిఎంసీ అధికారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించుకోవడం జరిగినదని అన్నారు. కాలనీల సమస్యలను ప్రథమ ప్రాధాన్యత గా తీసుకొని అభివృద్ధి పనులలో అలసత్వం ప్రదర్శించకుండా త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూడలని తెలియచేసారు. పరిసల పరిశు భ్రతే లక్ష్యంగా పనిచేస్తూ కాలనీలలో రోడ్లమీద గానీ, నాలాల్లో గానీ చెత్త వేయకుండా సిఎంసీ అధికారులు, కాలనీ అసోసియేషన్ వారు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సిఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం, జలమండలి విభాగం, నాయకులు, కార్యకర్తలు, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మాదాపూర్ కాకతీయ హిల్స్ అభివృద్ధి పనుల పరిశీలన....



క్రైమ్ మిర్రర్ మాదాపూర్: మాదాపూర్ కాకతీయ హిల్స్ లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కూకట్‌పల్లి జోన్ ఎస్ ఈ , మాదాపూర్ డీసీ తో కలిసి అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మసీదు భూమి నుంచి కాకతీయ హిల్స్ రోడ్ నెం.11, 3, 7 లకు లింక్ రోడ్డు అభివృద్ధి సిగ్నల్ నుంచి సున్నం చెరువు వరకు ఆక్రమణల తొలగింపు, పార్కింగ్ సమస్య పరిష్కారం సున్నం చెరువు కల్వర్ట్ నుంచి గోదావరి కట్స్, పార్వతీ నగర్ జంక్షన్ వరకు బీటీ రోడ్డు రీకార్పెటింగ్ హైటెక్ సిటీ ఫ్లైఓవర్ నుంచి ఆర్ఆర్ఆర్ బార్ వరకు ఫుట్ పాత్ అభివృద్ధి ప్రతిపాదన రోడ్ నెం.11 వక్ఫ్ బోర్డు భూమి వద్ద ప్రీకాస్ట్ గోడలతో ఫెన్సింగ్పనులను గడువులోగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.






# సుర్వి యాదయ్య గౌడ్‌పై బీజేపీ నాయకుల ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం

## అల్లందేవి చెరువు బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల రాజేష్

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురశీ:– రాష్ట్రంలోని ప్రజా సమస్యలపై, సర్పంచుల హక్కుల కోసం, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల సాధన కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్‌పై బీజేపీ జిల్లా నాయకుడు బచ్చుబోయిన దేవేందర్ యాదవ్ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అల్లందేవి చెరువు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల రాజేష్ అన్నారు. అల్లందేవి చెరువు గ్రామ సర్పంచ్ సౌజన్యను సర్పంచ్‌గా గెలిపించడంలో సుర్వి యాదయ్య గౌడ్ కీలకంగా పనిచేశారని ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సుర్వి యాదయ్య గౌడ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చౌప్పదండి నియోజకవర్గంలో సర్పంచ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై స్పందిస్తూ, సర్పంచులపై వేధింపులు ఉండకూడదని, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సుర్వి యాదయ్య గౌడ్ ప్రశ్నించారని ఏర్పుల రాజేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనపై రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అల్లందేవి



చెరువు గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనపై పూర్తి వాస్తవాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సభ్యులు, గ్రామ సభలో పాల్గొన్న వ్యక్తుల నుంచి వివరాలు సేకరించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహిళా సర్పంచ్ సౌజన్యను ఎవరైనా దూషించినట్లు విచారణలో తేలితే, అందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల రాజేష్ కోరారు. సుర్వి యాదయ్య గౌడ్ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఆధారాలు లేకుండా వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని, ఇలాంటి చర్యలను గ్రామ ప్రజలు సహించరని అన్నారు. అల్లందేవి చెరువు గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయ ప్రయోజనాల కోసం గ్రామస్తుల మధ్య విభేదాలు, తగాదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు అంగీకరించరని ఏర్పుల రాజేష్ అన్నారు. గ్రామంలో జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, వాస్తవాలు నిర్ధారణ కాకముందే వ్యక్తులపై ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన కోరారు.

# నవంబర్ చివరికల్లా రైతులకు హెచ్ఎండీఏ ప్లాట్లు

### ఆరుట్ల, ఫసల్‌వాది, కంది లే అవుట్లపై కలెక్టర్ సమీక్ష.. జగ్గారెడ్డి, నిర్మల సూచనలతో పనులు వేగవంతం

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05: సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లే అవుట్లపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లో హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకున్న రైతులకు ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యంపై సమావేశంలో చర్చించారు. గతంలో భూములు సేకరించి రైతులకు సర్టిఫికెట్లు అందజేసినప్పటికీ, ఇప్పటివరకు ప్లాట్ల పొజిషన్ ఇవ్వకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్న విషయాన్ని జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా లే అవుట్ల ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ పనులు, జాప్యానికి కారణాలు, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను హెచ్ఎండీఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆరుట్ల లే అవుట్ పరిధిలో 106 ఎకరాల 14 గుంటల్లో లే అవుట్ ప్రక్రియ పూర్తయినప్పటికీ, లబ్ధిదారుల జాబితా ఇంకా అందలేదని అధికారులు తెలిపారు. ఫసల్‌వాది ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియ సుమారు 60 శాతం పూర్తయిందని, కొంత ప్రాంతంలో రైతుల నుంచి



అభ్యంతరాలు ఉన్నాయని వివరించారు.

కంది గ్రామంలో 50 ఎకరాలకు హెచ్ఎండీఏ లే అవుట్ ప్రతిపాదించగా, ప్రస్తుతం 46 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. లబ్ధిదారుల జాబితా ఇంకా పంపలేదని, కంది లే అవుట్ పనులను అక్టోబర్ 10వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కంది, ఫసల్‌వాది లే అవుట్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. కంది, ఫసల్‌వాది, ఆరుట్ల లే అవుట్లలోని పనులను పూర్తి చేసి నవంబర్ చివరికల్లా భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హెచ్ఎండీఏ అధికారులు సమావేశంలో తెలిపారు. రైతులు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నందున ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని జగ్గారెడ్డి కోరారు. లే అవుట్లకు సంబంధించిన మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కాగా, నవంబర్ చివరికల్లా హెచ్ఎండీఏ లే అవుట్లలో భూములు కోల్పోయిన రైతులందరికీ ప్లాట్లు కేటాయించేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.



## ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 44 ఫిర్యాదులు....

**అందిన ఫిర్యాదులలో టౌన్ ప్లానింగ్ అధికం 31 ఫిర్యాదులు...**

క్రైమ్ మిర్రర్ సైబరాబాద్: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సోమవారం ప్రజావాణిలో పౌరులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 44 ఫిర్యాదులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ – 31, ఇంజినీరింగ్ – 6, అర్బన్ బయోడైవర్సిటీ – 2, ఎస్టేట్స్ – 1, ఫుడ్ సేఫ్టీ – 1, రెవెన్యూ – 1, శానిటేషన్ – 1, యూసీడ్ – 1ప్రతి ఫిర్యాదుకు గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ ఇచ్చి ఆన్‌లైన్‌లో స్టేటస్ తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని, ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# వాలీబాల్‌లో గుండాల మోడల్ స్కూల్ హవా..!

**జిల్లా స్థాయిలో దుమ్మురేపి.. రాష్ట్రస్థాయికి ముగ్గురు విద్యార్థులు ఎంపిక!**

**క్రీడా మైదానంలో సత్తా చాటిన మాళవిక, నందు, కావ్య శ్రీ**




క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- గుండాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రీడా రంగంలో సత్తా చాటారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి. మాళవిక, ఆర్. నందు, ఇ. కావ్య శ్రీ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

**విద్యార్థులకు అభినందనలు**

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ జి. రాము, వ్యాయామ ఉపాధ్యాయులు పి. మహేష్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గుండాల మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## గుండాల రెవెన్యూ కార్యాలయంలో అక్రమాలపై 'చర్యలు' ఎప్పుడు?

**భూ రికార్డుల తారుమారు.. అక్రమ రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణకు డిమాండ్**

క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-గుండాల తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులను తారుమారు చేసి అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ గుండాల మండల పార్టీ




ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ కార్యాలయంలో చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్న భూ అక్రమాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. నూనెగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 237, 358కు సంబంధించిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపిస్తూ, అందుకు సహకరించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే గ్రామంలో గతంలో పెద్ద చెరువు పరిధిలో ఉన్న భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లపైనా అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ల కారణంగా అసలైన పట్టాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెవెన్యూ రికార్డుల్లో మార్పులు, చేర్పులు జరిగితే నష్టపోయేది సామాన్య రైతులేనని నాయకులు అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో అవినీతికి తావులేకుండా, భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని కోరారు. భూ వివాదాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులుగా తేలిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పింగళి విజయభాస్కర్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎరుకల శారద గౌడ్, బీజేవైఎం జిల్లా ఐటీ సెల్ బుక్క చంద్రశేఖర్, మండల కోశాధికారి పరమేశ్వరి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సంగీత, బీజేపీ సీనియర్ నాయకులు సింగారం సోమరాజు, గోపాల్, కాళీ సుమలత, సైదులు, గుండాల బూత్ అధ్యక్షుడు సోమన్న, నూనెగూడెం అధ్యక్షుడు మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి హరితహారం ప్రస్థానంలో మరో వినూత్న అడుగులు

**మూసివేసిన గని భూముల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకం**




మందమర్రి టౌన్ అక్టోబర్ 05 క్రైమ్ మిర్రర్: సింగరేణి చరిత్రలో తొలిసారిగా మూసివేసిన గని భూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు మందమర్రి ఏరియా శ్రీకారం చుట్టింది. బొగ్గు తవ్వకాలు పూర్తయిన భూములను పర్యావరణహితంగా వినియోగించడంతో పాటు భవిష్యత్‌లో స్థిరమైన ప్రయోజనాలు పొందే దిశగా సింగరేణి యాజమాన్యం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. సింగరేణి సీ అండ్ ఎండీ డాక్టర్ బుధ ప్రకాష్ జ్యోతి దిశానిర్దేశంలో గనుల తవ్వకాలు పూర్తయిన ప్రాంతాల్లో వ్యవసాయ–అటవీ, ఉద్యానవనాల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కే. వెంకటేశ్వర్లు, జీఎం ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ బి. సైదులు పర్యవేక్షణలో మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మందమర్రి ఏరియా నర్సరీ వెనుక భాగంలోని మూసివేసిన కేకే టు భూగర్భ గని ఆవరణలో సుమారు 2 హెక్టార్ల విస్తీర్ణంలో 285 ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. 135 సంవత్సరాల సింగరేణి చరిత్రలో బొగ్గు గనుల భూముల్లో ఆయిల్‌పామ్ తోటను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్న సింగరేణి, మూసివేసిన గని భూములను సైతం ఉత్పాదకంగా మార్చే దిశగా అడుగులు వేస్తోంది. మందమర్రిలో ప్రారంభమైన ఆయిల్‌పామ్ సాగు భవిష్యత్‌లో ఇతర గని ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, జీఎం ఎస్ఓ జి. ఎల్. ప్రసాద్, శాంతిఖని గని ఏజెంట్ ఎస్. సంతోష్, కె. కె. గ్రూప్స్ ఏజెంట్ ఖాదిర్, కె. కె. ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డి. రాంబాబు, బెల్లంపల్లి రీజియన్ డీజీఎం (అటవీ) హరి నారాయణ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టి కారు పరారీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

**సీసీ ఫుటేజీతో పరారైన కారు కోసం గాలింపు**

**గంగమ్మగుట్ట వద్ద ప్రమాదం..**

**టోల్‌గేట్ సీసీ కెమెరాలతో కారు గుర్తింపు**

క్రైమ్ మిర్రర్, వేములపల్లి ప్రతినిధి: వేములపల్లి మండలం బుగ్గవాయిగూడెం సమీపంలోని గంగమ్మగుట్ట వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది.



కుక్కడం గ్రామానికి చెందిన బొంగర్ల లక్ష్మయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఏపీ 16 డీఎం 7853 నంబర్ గల శాంట్రో కారు ఢీకొట్టి ఆపకుండా పరారైనట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన లక్ష్మయ్యను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు మాడుగులపల్లి టోల్‌గేట్ సీసీ ఫుటేజీని పరిశీలించి కారును గుర్తించే చర్యలు చేపట్టారు. ఘటనపై వేములపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

**బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి**



కూకట్ పల్లి, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) : మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటును నమోదు చేసుకోవాలని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ఓటర్లకు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవి సింగ్ మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో సమర్థవంతంగా వినిపించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. అందుకే అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

# సున్నం చెరువు సేవరేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## అధికారుల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలి...ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్‌పల్లి, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) :** అల్లాపూర్ డివిజన్‌లోని సున్నం చెరువు ప్రాంతంలో నెలకొన్న సేవరేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. సోమవారం సున్నం చెరువు ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించి స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. అయ్యప్ప సొసైటీ, పర్వతనగర్ ప్రాంతాల నుంచి వస్తున్న సేవరేజీ మురుగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సున్నం చెరువు పరిసరాల్లో సేవరేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే హైడ్రా, హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల సంస్థ, నీటిపారుదల శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. సున్నం చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సేవరేజీ సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపడతామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

**గాయత్రినగర్‌లో రోడ్డు పనుల పరిశీలన**

అనంతరం గాయత్రినగర్‌లో కొనసాగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు జాప్యం చేయకుండా, ఆయా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. తాగునీరు, సేవరేజీ, రహదారులు తదితర మౌలిక సదుపాయాల విషయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, ఐలయ్య, తిరుపతి, బాబా, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ నక్ష బాట హద్దులు నిర్ధారించండి.

## తహసీల్దార్ రాజేందర్ రెడ్డి కి గ్రామస్తుల వినతి..



కేశంపేట,(క్రైమ్ మిర్రర్): ప్రజలు,రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామ నక్షబాట హద్దులు నిర్ధారించి,గ్రామస్తులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని నిడద వెల్లి గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ తో పాటు పంచాయితీ పాలకవర్గం,రైతులు సోమవారం కేశంపేట తహశీల్దార్ రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. గ్రామంలో సర్వే నంబర్ 19లో గ్రామ కంఠం నక్షలో చూపబడిన రోడ్డును క్షేత్రస్థాయిలో సర్వే చేసి,రోడ్డు కొలతలు,హద్దులను నిర్ధారించాలని కోరారు. అలాగే గ్రామంలో సర్వే నెంబర్ 31లో ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను కూడా సర్వే చేసి హద్దులను సంబంధిత రెవెన్యూ,సర్వే అధికారులను క్షేత్రస్థాయికి పంపించి,నక్ష ప్రకారం రోడ్డును,ప్లాట్లను పూర్తిగా సర్వే చేసి కొలతలు నిర్ణయించి,హద్దులను గుర్తించాలని కోరారు. అదేవిధంగా రోడ్డు ఎక్కడైనా ఆక్రమణకు గురై ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. వినతి పత్రం అందించిన వారిలో ఉపసర్పంచ్ సఫూర అమేర్,వార్డుసభ్యులు చంద్రయ్య,చెన్నయ్య,మాజీ ఉపసర్పంచ్లు పల్లటి కృష్ణయ్య,సిల్వరు మల్లయ్య నాయకులు రామలింగం, నారాయణరెడ్డి, ముత్యాలు, జంగయ్య తదితరులు ఉన్నారు.

# సేవ సంకల్ప్ అభియాన్ లో భాగంగా అంగన్వాడి సిబ్బందికి సన్మానం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా క్షేత్రంలో ప్రజా సేవలో 25 సంవత్సరాలు ముఖ్య మంత్రిగా మరియు ప్రధాన మంత్రిగా దేశ సేవకి ప్రజా సేవకు కృతజ్ఞతతో రాష్ట్ర పార్టీ మరియు జిల్లా పార్టీ ఆదేశాల మేరకు మీర్పేట్ బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో సేవ సంకల్ప్ అభియాన్ లో భాగంగా అంగన్ మిలన్ సేవ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మీర్పేట్ క్లస్టర్ 1లో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన టీచర్స్ మరియు వర్కింగ్ స్టాఫ్ కు అభినందనలతో కూడిన సన్మానం చేయడం జరిగింది. అనంతరంఅంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు మరియు పోషకాహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 45వ సబ్-జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ విద్యార్థిని ఎంపిక



**బాలానగర్, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) :** బిలాయ్‌లో జరగనున్న 45వ సబ్–జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026--27 పోటీలకు హైదరాబాద్ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కు చెందిన ఎమ్. భవిష్య ఎంపికైంది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ లో పనిచేస్తున్న జగదీష్ కుమార్తె ఎమ్. భవిష్య, ప్రస్తుతం శ్రీ చైతన్య పాఠశాల, వివేకానందనగర్‌లో 8వ తరగతి చదువుతోంది. భవిష్య తన బాల్ బ్యాడ్మింటన్ శిక్షణను హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ గ్రౌండ్స్‌లో కొనసాగిస్తూ, ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. భవిష్య ఎంపిక పట్ల హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సెక్రటరీ సాయినాథ్, రంగారెడ్డి జిల్లా ట్రెజరర్ బాలాజీ, తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ వివి.రమణ, హెచ్ యే ఎల్ బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్ జోగారావు, అలాగే కోచ్ పి.ఎమ్.పి సారధిరావు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, శిక్షణతో భవిష్య ఈ స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు.



# కేపీహెచ్‌బీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## పైప్‌లైన్ సామర్థ్యం పెంచి నీటి సరఫరా మెరుగుపరచాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) :** కేపీహెచ్‌బీ డివిజన్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కేపీహెచ్‌బీ డివిజన్‌లోని రోడ్ నంబర్ 1, రోడ్ నంబర్ 5 ప్రాంతాల్లో పర్యటించి, స్థానికంగా నెలకొన్న తాగునీటి సమస్యను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుత నీటి పైప్‌లైన్ సామర్థ్యం సరిపోకపోవడం వల్ల తగిన స్థాయిలో నీటి సరఫరా జరగడం లేదని స్థానికులు తెలిపారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే, సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు తాగునీటి విషయంలో ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి అని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటి పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పైప్‌లైన్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసి నీటి సరఫరాను మెరుగుపరచాలని సూచించారు. సమస్యను తక్షణమే పరిష్కరించి స్థానిక ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా, తాత్కాలిక చర్యలతో సమస్యను పరిష్కరించకుండా భవిష్యత్తులోనూ నీటి సమస్యలు పునరావృతం కాకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. జనాభా పెరుగుదల, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా, తగినంతగా తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, పాతూరి గౌడ్, వలవల నాయుడు, వాటర్ వర్క్స్ అధికారులు, కాలనీ వాసులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ పోస్టులు విడుదల

**కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్‌గా మట్టే ప్రసన్న కుమార్ నియామకం**



**కూకట్‌పల్లి, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) :** మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన నూతన పోస్టులు విడుదలైన సందర్భంగా, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్‌గా మట్టే ప్రసన్న కుమార్ సోమవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గా భవన్‌లో నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ నూతనంగా నియమితులైన మట్టే ప్రసన్న కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తూ పార్టీకి మరింత సేవలందించాలని బండి రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ డ్రైనేజీ, కలుషిత మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించండి

## వాటర్ బోర్డ్ డీజీఎమ్ త్రినాథరావు కి వినతిపత్రం అందజేసిన జనసేన నాయకులు



**కూకట్ పల్లి, అక్టోబర్ 05 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం 4 వ ఫేస్ కాలనీలోని ఎల్.ఐ.జి ఫ్లాట్స్ లో గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలు, కలుషిత మంచినీటి సమస్యల పరిష్కారం నిమిత్తం, సోమవారం వాటర్ బోర్డ్ డీజీఎమ్ త్రినాథరావు కి బాధితుల తరఫున జనసేన నాయకులు కొల్లా శంకర్, ఆళ్ల నరేంద్ర అడ్వకేట్ వినతి పత్రం అందజేశారు. వెంటనే త్రినాథ రావు స్పందించి వారి యొక్క సిబ్బందిని సమస్య ఉన్న ప్రాంతానికి పంపించి సమస్య పరిశీలించి, సమస్యలను వీలైనంత త్వరగా క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. మన కాలనీ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి అందరి సహకారం అవసరం అని జనసేన నాయకులు అన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# సర్పంచ్ భర్త బెదిరింపులు అరికట్టాలి

**ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన**

**అల్లందేవి చెరువు అఖిలపక్ష నాయకులు**




**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం అల్లందేవిచెరువు గ్రామ పంచాయతీలో మహిళా సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి భర్త గ్రామ పాలనలో జోక్యం చేసుకుంటూ, గ్రామ ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 2వ తేదీన జరిగిన గ్రామ సభలో కూడా సర్పంచ్ భర్త వ్యవహారశైలిపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిపాలనలో సర్పంచ్ భర్త జోక్యాన్ని అరికట్టి, గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, సర్పంచ్ భర్తపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ పరిపాలన సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మహిళా సర్పంచ్ భర్త పెత్తనాన్ని అరికట్టే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు సుర్వి నరసింహ గౌడ్ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏర్పుల సురేష్ మహారాజ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల రాజేష్ సుర్వి శేఖర్ గౌడ్ మండల నాయకు లింగస్వామి గుండు లింగన్న గౌడ్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాత్క శేఖర్ యాదవ సిపిఎం మండల నాయకులు గుండు జంగయ్య గంగాదేవి బిక్షపతి మాజీ వార్డు సభ్యులు గుండు రాజు అఖిలపక్షం నాయకులు సుర్వి శేఖర్ గౌడ్ హనుమంతు వెంకటేష్ బాత్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యామిలీ డే,సద్దుల బతుకమ్మ,రామలీల వేడుకలను ఘనంగా నిర్వహించాలి: జిఎం రాధాక్రిష్ణ

**మందమర్రి టౌన్ అక్టోబర్ 05 క్రైమ్ మిర్రర్:** మందమర్రి ఏరియాలో ఫ్యామిలీ డే,సద్దుల బతుకమ్మ, రామలీల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సోమవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం ఎన్. రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు,గుర్తింపు సంఘాల నాయకులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వేడుకలు జరిగే అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాల అలంకరణను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియం మైదానం,మందమర్రి సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం,సోమగూడెం మైదానం,బెల్లంపల్లి ఏఎంసీ మైదానాలను ముందుగానే శుభ్రం చేసి వేడుకలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే రామలీల కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కూడా సత్వరం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓటు జిఎం,జి.ఎల్. ప్రసాద్, మందమర్రి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ, దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ ఏఐటియుసి సెక్రటరీ, అక్బర్ అలీ, డీజీఎం పర్సనల్ సిహెచ్.అశోక్, ఏజీఎం ఎఫ్ అండ్ ఏ ఆర్ వివిఎస్ ఆర్ కె.ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మురళి, డీజీఎం సివిల్ మదీనా భాష, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్ అండ్ పిసి కె.వెంకటేశ్వర రెడ్డి, వర్క్ షాప్ ఎస్ ఈ నరేష్, సీనియర్ పి ఓ సత్యనారాయ తథా ఇతరులు పాల్గొన్నారు.

## సేవలకు గుర్తింపు.. శంకర్‌పల్లి వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుకు ఘన సత్కారం

**మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే వినోద్ చేతుల మీదుగా సత్కారం**



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :**కాంగ్రెస్ సీనియర్ నేత గడ్డం వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా సోమవారం నగరంలోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సమాజంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న శంకర్‌పల్లికి చెందిన వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు గైక్వాడ్‌ను ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభు గైక్వాడ్‌కు శాలువా కప్పి, మెమొంటో అందజేసి అభినందించారు. పశుపోషకులకు, రైతులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ సత్కారం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రభు గైక్వాడ్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సత్కరించడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ప్రజలకు, పశుపోషకులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. తనను సత్కరించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే వినోద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విగ్రహ ఏర్పాటుకై జిహెచ్ఎంసి కమిషనర్ ని కలిసిన కొండ్ర ఓం ప్రకాష్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జిహెచ్ఎంసి బడంగ్పేట్ సర్కిల్ పరిధి జిల్లెల్లగూడ లోని చందన చెరువు కట్టపై ఆది జాంబవంతుని విగ్రహ ఏర్పాటుకై టి పి సి సి ఎస్ సి డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి కొండ్ర ఓంప్రకాష్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ని కలిసి చెరువు కట్టపై విగ్రహ ఏర్పాటు గురించి వివరించడం జరిగింది. దీనికి కమిషనర్ కానుకూలంగా స్పందించి జాయింట్ కమిషనర్ కి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఓం ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యకులు గజ్జల రాంచందర్, ఉపాధ్యక్షులు పోగుల నరసింహ, దండు యాదయ్య, మంద బలరాం, ముక్కుపల్లి బాలకృష్ణ, జనగే నరేష్, శాఖ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## చలో కలెక్టరేట్ కొంగర కలాన్ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**శంకర్‌పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి పిలుపు**

**మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి పిలుపు**




**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద అక్టోబర్ 6న నిర్వహించనున్న అఖిల పక్షం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్‌పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి మరియు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా, ఎస్ ఆర్ ఐ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఏఐసీసీ, ఇండియా కూటమి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 6, మంగళవారం ఉదయం 10 గంటలకు కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి శంకర్‌పల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్ ,లు వర్డ్ మెంబర్ లు ఉపసర్పంచ్ లు మాజీ ఎంపీటీసీ లు మాజీ సర్పంచ్ లు .మాజీ వార్డ్ మెంబర్లు,కౌన్సలర్లు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ సేవాదళ్ తదితర అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొల్లారం వెంకట్ రెడ్డి చంద్రమౌళి కోరారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఈ నిరసన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## బాధిత కుటుంబాలకు పాపిశెట్టి రాము ఆర్థిక భరోసా

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి, మేడిగడ్డ గ్రామాల్లో ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. విఠాయిపల్లికి చెందిన మద్దూరి పెంటయ్య, మేడిగడ్డ గ్రామానికి చెందిన వడ్త్యావత్ హుని మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రాము మృతుల కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుఃఖ సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి, మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీనునాయక్, రమేష్ యాదవ్, రాకేష్, జంగయ్యతో పాటు మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తే సహించేది లేదని హెచ్చరిక

**తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

**రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం**




గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ఉద్యమాలు నిర్వహిస్తుంటే రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పనిచేస్తున్న శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ ల వేతనాలు జిహెచ్ఎంసి నుండి ఎలాంటి కోతలు లేకుండా వేతనాలు కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారు. కార్మికులకు కాంట్రాక్టర్ మాత్రం వేతనాలు ఇష్టం వచ్చినట్లు కట్ చేసి ఇవ్వడం దారుణం అన్నారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఉన్నటువంటి సర్కిల్ లలో కార్మికులకు ఒకే విధంగా ఈఎస్ఐ ,ఈపీఎఫ్ కట్ చేసిన తర్వాత రూ.17174/-లు వేతనాలు ఇచ్చే విధంగా పాత పద్ధతిలో అమలయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ గారిని కోరడం జరిగింది. జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ కట్ చేసిన వేతనాలను వెంటనే కార్మికులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే విధంగా వేతనాలను అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ అనిల్, చంద్రయ్య, చంద్రమోహన్, వినయ్, శంకరయ్య, కృష్ణ, శ్రీకాంత్, వెంకటేష్, సురేష్, జగదీష్, శాంసన్, రాజు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పేరుతో అక్రమ వసూళ్లు..

**పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోండి!**

**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు వెంకటాంబవి తండావాసుల ఫిర్యాదు**



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వెంకటాంబవి తండా గ్రామ పంచాయతీ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బాధితులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కోర్ర రఘు అనే వ్యక్తి కొత్త పింఛన్ అప్లికేషన్ల ఆమోదం కోసం ప్రజల వద్ద నుంచి ?500, సిస్టమ్ ఆపరేటర్ ఎంట్రీ కోసం మరొక ?1000 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పింఛన్ ఇప్పిస్తానని చెప్పి బెదిరింపులకు గురిచేస్తున్నారని, ఎటువంటి రశీదులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డీజిల్ విషయంలోనూ అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై పూర్తి స్థాయి విచారణ జరిపి సదరు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పబ్బు వజ్రమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ తల్లి దశదిన కార్యక్రమం మల్కాపురం గ్రామంలోని కేఆర్ఎస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా ఈ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి .ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్,యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ముద్దంగుల నరసింహ,నారాయణపురం మాజీ సర్పంచ్ కొన్ రెడ్డి నరసింహ, అంతటి ధనరాజ్ గౌడ్, మన్నె నర్సిరెడ్డి, నర్రి లింగస్వామి,గునిగంటి రాజు గౌడ్, బద్దుల యాదగిరి యాదవ్,నారాయణపురం మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మెరుగు గిరి ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, కె . యాదయ్య,పి . యాదయ్య తదితరులు పాల్గొన్నారు..



# అక్టోబర్ 15 లోపు భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి అక్టోబర్ 05 క్రైమ్ మిర్రర్:** పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో భూ రీసర్వేలో భాగంగా చేపడుతున్న విలేజ్ బౌండరీ(హద్దుల గుర్తింపు) పనులను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రీసర్వేకు సంబంధించి రైతులకు ముందస్తుగా నోటీసులు అందజేయడంతో పాటు, గ్రామ పంచాయతీలో పూర్తి సమాచారం అందించాలని ఆదేశించారు. గ్రామంలో రీసర్వే పనులను అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హద్దుల గుర్తింపు పనుల్లో జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం వీరాయపల్లి గ్రామంలో ఒంటరి మహిళా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రమీల అనే లబ్ధిదారురాలి ఇంటికి కలెక్టర్ వెళ్లి దరఖాస్తును పరిశీలించి, వివరాలను స్వయంగా తనిఖీ చేసి ధ్రువీకరించారు. పింఛన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దరఖాస్తుల వెరిఫికేషన్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి అవసరానికి మించి ఖర్చు చేయకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా బేస్‌మెంట్‌లను అనవసరంగా ఎత్తు పెంచి అదనపు వ్యయం చేయవద్దని లబ్ధిదారులకు సూచించారు. ఈ విషయంలో అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ, నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం కోసం అర్హులైన లబ్ధిదారులకు గ్రామ స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జెడ్పి సీఈవో యాదయ్య, ఇతర అధికారులు, స్థానిక గ్రామ సర్పంచ్, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మందమర్రిలో కాకా వెంకటస్వామి విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ

## కాంగ్రెస్ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు



మందమర్రి టౌన్ అక్టోబర్ 05 క్రైమ్ మిర్రర్: మాజీ పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి కాక గడ్డం వెంకటస్వామి 97వ జయంతిని పురస్కరించుకొని సోమవారం కాంగ్రెస్ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షులు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి హాజరై కాక వెంకట స్వామి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణం లోని సింగరేణి పార్క్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న వెంకట స్వామి విగ్రహ ఏర్పాటు కు భూమి పూజ నిర్వహించారు. అనంతరం రఘునాధ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహానేత, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్రం కోసం తనవంతు కృషి చేశారని గుర్తు చేశారు. కాకా ఆశయ సాధనకు ప్రతి ఒకరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోతుకు సుదర్శన్, కాంపెల్లి సమ్మయ్య, పుల్లూరి లక్ష్మణ్, గుడ్ల రమేష్, ఉపేందర్ గౌడ్, పైడిమల్ల నర్సింగ్, ఆఫీజ్, రాజన్న, మంకు రమేష్, సుకూర్, నెరవేట్ల శ్రీనివాస్, మహిళానాయకులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తధా ఇతరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేంద్ర మాజీ మంత్రి జి. వెంకటస్వామి జయంతి వేడుకలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కేంద్ర మాజీ మంత్రి, దివంగత జి. వెంకటస్వామి జయంతి వేడుకలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దివంగత జి. వెంకటస్వామి అందించిన సేవలను స్మరించుకున్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. వెంకటస్వామి ఆశయాలను స్మరించుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.



ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్‌తో పాటు విశ్వవిద్యాలయ అధికారులు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొని జి. వెంకటస్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.

# చారిత్రక కట్టడాల పరిరక్షణే ఇంటాక్ నల్లగొండ చాప్టర్ లక్ష్యం

## వారసత్వ సంపద పరిరక్షణకు సమష్టి కృషి అవసరం: చాప్టర్ కన్వీనర్ సముద్రాల ధనుంజయ..

**నల్లగొండ జిల్లా న్యూస్ అక్టోబర్ 05 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి.:** జిల్లాలోని చారిత్రక కట్టడాలు, పురావస్తు సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని ఇంటాక్ నల్లగొండ జిల్లా చాప్టర్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ భవన్‌లో సోమవారం చాప్టర్ రెండవ సమావేశం నిర్వహించారు. సభ్యుల పరిచయంతోపాటు గుర్తింపు కార్డులు, బ్రోచర్లను అందజేశారు. కన్వీనర్ సముద్రాల ధనంజయ్య, కో-కన్వీనర్ డాక్టర్ ఆడెపు రమేష్ సంస్థ లక్ష్యాలు, జాతీయ, రాష్ట్ర, జిల్లాల స్థాయిల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కన్వీనర్ సముద్రాల ధనంజయ్య మాట్లాడుతూ.. 1969 నుంచి సంస్కృతి పరిరక్షణ, సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ, అదే స్ఫూర్తితో దేవరకొండ ఖిల్లా పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఖిల్లా రక్షణకు సంఘాన్ని ద్వారా , ప్రజాప్రతినిధులకు విన్నవించడంతోపాటు చారిత్రక విశేషాలను వీడియో రూపంలో భద్రపరిచామన్నారు. వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి పరిరక్షణకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ, నిపుణుల సూచనలు, ప్రజల భాగస్వామ్యంతో కార్యాచరణ రూపొందించామని . స్థానిక పండుగలు, కళలు, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు .కో-కన్వీనర్ డాక్టర్ ఆడెపు




రమేష్ మాట్లాడుతూ, వారసత్వ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో చరిత్ర, సంస్కృతి పట్ల ఆసక్తి పెంచేందుకు నెలవారీ హెరిటేజ్ వాక్స్, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వేదకుమార్ ప్రోత్సాహంతో ఇంటాక్ జీవితకాల సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. నల్లగొండ చాప్టర్‌ను ఉత్తమ చాప్టర్‌గా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అంబటి వెంకన్న మాట్లాడుతూ.. రాచకొండ, పానగల్లు, భువనగిరి, దేవరకొండ వంటి ప్రదేశాల చారిత్రక విశేషాలను వెలికితీసి, భావితరాలకు అందించాలని కోరారు. ఇంటాక్ ను పరిచయం చేసి, తనను ప్రోత్సహించిన వేదకుమార్ కి ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండ వైభవాన్ని ప్రతిబింబిస్తూ...

**నన్ను కన్న పల్లెతల్లి, నా జిల్లా నల్లగొండ**

వెలసినావు వైభోగంగా, నిలిచినావు గుండెల నిండా... అనే పాటను ఆలపించారు. జగిని భీమయ్య మాట్లాడుతూ, ఇంటాక్ నల్లగొండ చాప్టర్ ద్వారా వారసత్వ ప్రదేశాల పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. సంస్థలో భాగస్వామిని చేసిన వేదకుమార్, కన్వీనర్ సముద్రాల ధనంజయ్య, కో-కన్వీనర్ డాక్టర్ ఆడెపు రమేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. పల్లె సతీష్ సమావేశాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో జ్యోతిరెడ్డి, అంజన్, లింగయ్య, నవీన్‌కుమార్, శంకర్, లింగమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులతోపాటు చాప్టర్ సభ్యులు, వారసత్వ పరిరక్షణపై ఆసక్తి కలిగినవారు, స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు..



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావ్ ని బిజెపి రాష్ట్ర కోపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్ర అధ్యక్షుడిగా ఫీజు రియంబర్స్మెంట్, నిరుద్యోగ సమస్యలు, రైతుబంధు, రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలు తదితర అంశాలపై మీ పోరాటానికి కార్యకర్తల తరపున రాంచందర్ రావ్ కి అభినందనలు తెలిపిన కోలన్ శంకర్ రెడ్డి.

(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

# జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు గ్రీన్ గ్రోవ్ విద్యార్థుల ఎంపిక




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు త్రోబాల్ క్రీడలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని అనురాగ్ యూనివర్సిటీలో అక్టోబర్ 4న నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రో బాల్ ఎంపిక పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సబ్‌జూనియర్ బాలికల విభాగంలో కొత్తపల్లి సహస్ర, బాలుర విభాగంలో షేక్ సోను సోహెల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ 30, 31, నవంబర్ 1 తేదీల్లో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో నిర్వహించనున్న జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు తెలంగాణ రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని క్రమశిక్షణతో సాధన చేయాలని, పోటీల్లో ఆత్మవిశ్వాసంతో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. జాతీయస్థాయికి ఎంపికైన సహస్ర, సోను సోహెల్‌లను అభినందిస్తూ, వారి భవిష్యత్ క్రీడా ప్రస్థానం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో పోల గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను విద్య అభినందించారు...

# సంఘీనగర్‌లో సామూహిక సీమంతాలు





**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 05:** జీహెచ్‌ఎంసీ తొర్రూరు డివిజన్ పరిధి ఉమర్‌ఖాన్‌గూడ, సంఘీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సేవా సంకల్ప మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నరేంద్రమోదీ 25 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా గర్భిణిలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం జరిపారు. స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు, తుర్కయంజాల్ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్ మాట్లాడుతూ సమంజంలోని అట్టడుగువర్గాల ఆరోగ్య పరిరక్షణకు, పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లను సత్కరించామన్నారు. దేశ రక్షణ కోసం మోదీ అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. ఆయన ఒదించిన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త రాంరెడ్డి, నల్ల మల్లారెడ్డి, కందాల బలదేవరెడ్డి, సువర్ణ, కొలను రవీందర్ రెడ్డి, నల్ల బాల్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, డాక్టర్ స్వరూప, అంగన్‌వాడీ సిబ్బంది సానం మంగమ్మ, ఆశావర్కర్ మాధవి, శైలజ, ఒనమాల భాగ్యలక్ష్మి, సుగుణమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.




## గౌల్దొడ్డిలో 111 జీవోకు తూట్లు..

# భారీ షెడ్ కూల్చివేత

### క్రైమ్ మిర్రర్ కథనానికి స్పందించిన అధికారులు







**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని గౌల్దొడ్డిలో 111 జీవో నిబంధనలకు విరుద్ధంగా భారీ షెడ్డును నిర్మిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు స్పందించారు. ప్రధాన రహదారి పక్కన, అనమయ్య కన్వెన్షన్ సమీపంలో చేపట్టిన నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూ వినియోగం, 111 జీవో నిబంధనల వర్తింపు తదితర అంశాలపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేశారు. అయితే నిర్మాణం 111 జీవోకు విరుద్ధమన్న విషయం అధికారికంగా ఏ మేరకు నిర్ధారణ అయిందన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు చేపట్టిన కూల్చివేత చర్యలకు సంబంధించిన కారణాలు, అనుమతుల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. క్రైమ్ మిర్రర్ కథనానికి స్పందించి అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంతో, నిర్మాణానికి సంబంధించిన వాస్తవాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. నిబంధనల ఉల్లంఘన జరిగిందని నిర్ధారణైతే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి

### బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన సేవలు చిరస్మరణీయం: సంధ్యారాణి



**రామకృష్ణాపూర్ అక్టోబర్ 5 (క్రైమ్ మిర్రర్):** మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం క్యాతనపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి చైర్‌పర్సన్ గొడిశెల సంధ్యారాణి, కమిషనర్ ఎన్. మురళీకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్, కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్‌పర్సన్ సంధ్యారాణి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, పేదల సంక్షేమానికి గడ్డం వెంకటస్వామి విశేషంగా కృషి చేశారని అన్నారు. కార్మికులు, అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ఎన్. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సేవకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు గడ్డం వెంకటస్వామి అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. వైస్ చైర్‌పర్సన్ సరిత శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వెంకటస్వామి నిరంతరం పోరాడారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 22 వార్డుల కౌన్సిలర్లు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి

## రూ.2 లక్షల లంచం తీసుకుంటూ డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** లంచం డిమాండ్ ఆరోపణలపై రాజేంద్రనగర్ శివరాంపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ట్రాప్ నిర్వాహించారు. ఎల్‌బీనగర్‌లోని ఓ ఫిజియోథెరపీ సెంటర్‌ను తిరిగి ప్రారంభించేందుకు అనుమతి విషయంలో రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగరు. ఏసీబీ డిఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో విచారణ కోనసాగిస్తునారు. ఏసీబీ డిఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... బాధితుడి నుంచి రూ.1 లక్ష స్వీకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, ఆమెకు సహాయకుడిగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నరు. ఎల్‌బీనగర్ ప్రాంతంలో రూ.1 లక్ష తీసుకున్న అనంతరం శ్రీనివాస్ ఆ విషయాన్ని డీఎంహెచ్ఓకు ఫోన్‌లో తెలిపినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం ఆధారంగా ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించి తదుపరి చర్యలు చేపతారూ. ఈ వ్యవహారంలో డబ్బులు ఎవరి కోసం తీసుకున్నారు? మొత్తం లంచం డిమాండ్‌లో డీఎంహెచ్ఓ పాత్ర ఎంత? శ్రీనివాస్ పాత్ర ఏమిటి? అనే అంశాలపై అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. లంచం వ్యవహారంపై సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న డీఎంహెచ్ఓ స్వర్ణకుమారిని అదుపులోకి తీసుకున్నరు. అనంతరం ఆమెను శివరాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించినట్లు తెలుస్తోంది. డీఎంహెచ్ఓతో పాటు శ్రీనివాస్, ఓ ప్రైవేట్ డ్రైవర్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ ముగ్గురి నుంచి లంచం వ్యవహారానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నరు.

**డీఎంహెచ్ఓ నివాసంలోనూ సోదాలు...**

ఇదిలా ఉండగా డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి నివాసంగా పేర్కొంటున్న అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సోదాల్లో కీలకమైన దస్తావేజులు, లంచం వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిలో కలకలం రేగింది. ప్రైవేట్ వైద్య సంస్థలకు సంబంధించిన అనుమతులు, పునఃప్రారంభ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరిగాయనే అంశంపైనా ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనకు సంబంధించి లంచం మొత్తం, ట్రాప్ నిర్వహించిన విధానం, నిందితులపై నమోదు చేయనున్న కేసు వివరాలు తదితర అంశాలను ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## హస్తాల వీరన్న వీరభద్ర స్వామి ఆలయ గుండం

# ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

### అక్రమ పహారీ గోడను తొలగించాలని భక్తుల డిమాండ్..:అధికారుల పరిశీలన



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ సర్కిల్ చింతల్ మెట్, ఉప్పర్‌పల్లి పరిధిలోని ప్రసిద్ధ శ్రీ హస్తాల వీరన్న వీరభద్ర స్వామి ఆలయ గుండం ఆక్రమణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఆలయ గుండం పరిధిలో అక్రమంగా నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పహారీ గోడను వెంటనే తొలగించి, ఆలయ స్థలాన్ని పరిరక్షించాలని భక్తులు, స్థానికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు స్వామివారి దివ్య విగ్రహానికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ గుండం ఆక్రమణకు సంబంధించిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, నాయకులు వై. శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, సామ ఇంద్రపాల్ రెడ్డి, ధర్మారెడ్డితో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు కలిసి పరిశీలించారు. ఆలయ గుండం ప్రాంతంలో నిర్మించిన పహారీ గోడను తొలగించాలని భక్తులు అధికారులను కోరారు. గుండం మధ్యలో గోడ నిర్మాణం జరిగిందని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించిన స్థలాలు, ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.

**అధికారుల సమక్షంలో పరిశీలన**

ఆలయ గుండం ఆక్రమణ ఆరోపణలపై ఎండోమెంట్స్ శాఖ, హైడ్రా, ఆర్డీవో, ఎమ్మార్వో, డీఎస్పీ, ఏసీపీ తదితర శాఖలకు చెందిన అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు నిర్వాహకులు తెలిపారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి, సంబంధిత అంశాలపై వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు భక్తులు తెలిపారు. అధికారుల హామీ మేరకు ప్రస్తుతం వేచి చూస్తామని వారు పేర్కొన్నారు.

**చర్యలు తీసుకోకపోతే ఆందోళన...**

ఆలయ గుండం విషయంలో అధికారులు త్వరితగతిన నిర్ణయం తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా వివాదానికి కారణమైన పహారీ గోడను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే చింతల్ మెట్, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్ ప్రాంతాల ప్రజలు, మహిళలు, భక్తులతో కలిసి తదుపరి కార్యాచరణ చేపడతామని నాయకులు తెలిపారు. ఆలయ గుండం పరిరక్షణ కోసం శాంతియుతంగా తమ నిరసనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్, చింతల్ మెట్, ఉప్పర్‌పల్లి ప్రాంతాలకు చెందిన ప్రజలు, మహిళలు, భక్తులు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ స్థల పరిరక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## అమెరికా నుంచి సుప్రియ మృతదేహం రప్పించేందుకు ఎంపీ రఘురాం రెడ్డి చొరవ

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ**

**కేంద్ర విదేశాంగ శాఖ, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ ఉన్నతాధికారులతో సంప్రదింపులు**

**మృతురాలి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్పు**




R. RAGHURAM REDDY
MEMBER OF PARLIAMENT (LOK SABHA)
KHAMMAM (TELANGANA)

Lr.No.: 112/MP-LS-KMM/2026 Date: 04.10.2026

To
Shri S. Jaishankar ji
Honourable Minister for External Affairs,
Government of India, New Delhi

Sir

Sub: Repatriation of mortal remains of Mrs. Kodumuru Supriya, resident of Khammam, Telangana, who died in an accident in the USA on 04.10.2026 – Request -Reg

Ref: Representation of Sri Daram Srinivas, resident of Simhadri Nagar, Khammam, dated 04.10.2026.

I would like to bring to your kind attention, the request of Sri Daram Srinivas, resident of Simhadri Nagar, Khammam of my Parliamentary Constituency, Telangana state, regarding the tragic death of his daughter, Mrs. Kodumuru Supriya, ...

I request you to kindly arrange to bring back the mortal remains of deceased person Mrs. Kodumuru Supriya to Khammam district of Telangana state, India at the earliest possible date at the expense of Government of India.

I would be highly obliged if you could consider the request and do the needful.

Regards,

Yours sincerely,
R RAGHURAM REDDY

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సింహాద్రినగర్‌కు చెందిన సుప్రియ మృతి చెందడం పట్ల ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని..ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహకారం అందేలా చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ (పీఓఈ) ఉన్నతాధికారులతో మాట్లాడారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయ అధికారులకు సమాచారం అందించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి.. సుప్రియ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**కుటుంబ సభ్యులకు ఫోన్‌లో పరామర్శ:** సింహాద్రినగర్‌లో నివాసం ఉంటున్న సుప్రియ తల్లిదండ్రులతో ఎంపీ రఘురాం రెడ్డి సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. జరిగిన ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. సుప్రియ మృతదేహాన్ని త్వరితగతిన స్వదేశానికి తీసుకొచ్చేందుకు తన వంతు అన్ని ప్రయత్నాలు కొనసాగిస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



## కెమెరాతో కలల చిత్రాలు.. అవార్డులతో నవీన్ ఖ్యాతి!

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఒక్క ఫొటో ఒక జ్ఞాపకాన్ని జీవితాంతం పదిలంగా ఉంచుతుంది. ఆ జ్ఞాపకానికి కళను జోడించి.. ప్రతి క్షణాన్ని అందమైన చిత్రంగా మలుస్తున్నాడు నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ అమరబోయిన నవీన్. ఫొటోగ్రఫీపై ఉన్న ఆసక్తిని వృత్తిగా మలచుకుని, వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న నవీన్.. వరుస అవార్డులతో తన ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఫొటో ట్రేడ్ షోలో నవీన్ ప్రతిభకు మరోసారి గుర్తింపు లభించింది. సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ట్రేడ్ షో నిర్వాహకులు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి వెడ్డింగ్ ఫొటోగ్రఫీ పోటీల్లో 'ఉత్తమ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ అవార్డు'తో పాటు 'భారత్ కళా పురస్కార్-2026'కు నవీన్ ఎంపికయ్యారు. ఈ పురస్కారాలను నిర్వాహకులు, ఫొటోగ్రఫీ రంగానికి చెందిన ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

**ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు**

వెడ్డింగ్ ఫొటోగ్రఫీని కేవలం ఫొటోలు తీయడంగా కాకుండా.. వివాహ వేడుకలోని భావోద్వేగాలు, ఆనందం, అనుబంధాలను సహజంగా కెమెరాలో బంధించడమే లక్ష్యంగా నవీన్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తనదైన ప్రత్యేక శైలిని అభివృద్ధి చేసుకుని ఫొటోగ్రఫీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన ప్రతిభకు ఇప్పటికే పలువురు ప్రశంసలు అందించగా.. తాజాగా ఒకేసారి రెండు ప్రతిష్ఠాత్మక గుర్తింపులు రావడం విశేషంగా నిలిచింది.

**'ఈ అవార్డులు మరింత బాధ్యత పెంచాయి'**

ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. తన ప్రతిభను గుర్తించి ఉత్తమ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ అవార్డు, భారత్ కళా పురస్కార్-2026కు ఎంపిక చేయడం ఎంతో ప్రత్యేకంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ గుర్తింపును అందించిన నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ఫొటోగ్రఫీ ప్రయాణంలో ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కస్టమర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎం.సి. శేఖర్, ట్రేడ్ షో నిర్వాహకులు ఎడిట్ పాయింట్ రమేష్, ఫొటోటెక్ అధినేత అభిమన్యురెడ్డి తదితరులతో పాటు దేశవ్యాప్తంగా వేలాది మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఆచార్లగూడెం నుంచి మొదలైన ఫొటోగ్రఫీ ప్రయాణం.. జాతీయ స్థాయి అవార్డుల వేదిక వరకు చేరడం ద్వారా అమరబోయిన నవీన్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు

## ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్'తో క్షేత్రస్థాయిలోకి అగ్రి వర్సిటీ శాస్త్రవేత్తలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడంతో పాటు రైతుల దిగుబడులు, ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. విశ్వవిద్యాలయ పరిశోధనా వ్యవస్థలో చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా 'ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్' కార్యక్రమాన్ని ఈ రబీ సీజన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక అంతరాలను తగ్గించడం, దిగుబడి అంతరాలను పూడ్చడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం, తద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని పంటల వైవిధ్యీకరణకు అనువైన పాలెం, తాండూర్, మధిర, వరంగల్, కంపాసాగర్, రుద్రూరు, ఆదిలాబాద్, జగిత్యాల, తోర్నాల, కరీంనగర్, బసంత్‌పూర్, కూనారం కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ఉపకులపతి వివరించారు. ప్రతి కేంద్రంలో నలుగురు శాస్త్రవేత్తలతో కూడిన ప్రత్యేక కార్యక్రమ అమలు బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో నాలుగు గ్రామాలను ఎంపిక చేసి, ప్రతి గ్రామం నుంచి 20 నుంచి 25 మంది వరకు ప్రగతిశీల రైతులను గుర్తించి వారికి ఆధునిక వ్యవసాయ సాంకేతికతల ప్యాకేజీని అందుబాటులోకి తీసుకురానున్నారు. పంటల వారీగా అనువైన ఆధునిక వంగడాలు, మెరుగైన పంట ఉత్పత్తి విధానాలు, సస్యరక్షణ చర్యలు, ఇతర అధునాతన సాంకేతికతలను ఎంపిక చేసిన గ్రామాల్లో రైతుల పొలాల్లోనే అమలు చేయనున్నారు. ఇందుకోసం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పర్యటిస్తూ నిరంతరం పర్యవేక్షణ చేస్తారని జానయ్య తెలిపారు. కేవలం సాంకేతికతలను రైతులకు వివరించడం కాకుండా వాటిని వారి పొలాల్లో అమలు చేసి, వాటి ఫలితాలను ప్రత్యక్షంగా చూపించడమే ఈ కార్యక్రమం ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. 'ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్' కార్యక్రమాన్ని రెండేళ్ల పాటు నిరంతరంగా అమలు చేయనున్నట్లు ఉపకులపతి తెలిపారు. ప్రతి సీజన్ లేదా సంవత్సరం ముగిసే సమయానికి ఆధునిక సాంకేతికతల ప్రభావాన్ని రైతుల పొలాల్లోనే అంచనా వేసి చూపించనున్నట్లు వివరించారు. దీంతో ఇతర రైతులు కూడా విజయవంతమైన సాంకేతికతలను స్వయంగా పరిశీలించి వాటిని తమ పొలాల్లో అనుసరించేందుకు ప్రోత్సాహం లభిస్తుందని, తద్వారా దిగుబడులు, రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజల సాగులో సాంకేతిక పరిజ్ఞానం అమలులో ఉన్న లోటు, దిగుబడి అంతరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు జానయ్య తెలిపారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించడం ద్వారా వాటి ఉత్పత్తిని పెంచడంతో పాటు భవిష్యత్‌లో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా సాంకేతిక పరిజ్ఞాన అమలులో ఉన్న అంతరాలను పూడ్చడం, దిగుబడి అంతరాలను తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు జానయ్య తెలిపారు. అలాగే నేల, నీటి నాణ్యతను మెరుగుపరచడం, పప్పుధాన్యాలు--నూనెగింజల లభ్యతను పెంచడం, వాటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం వంటి లక్ష్యాలను నిర్దేశించినట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖేత్ బచావో కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 18 నుంచి 31వ తేదీ మధ్య రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా 12 కేంద్రాల్లో ఒకచోట ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఉపకులపతి ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు ఇతర ఐసీఏఆర్ సంస్థలు, ఇక్రిశాట్, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల సహకారం, సాంకేతిక మద్దతును విశ్వవిద్యాలయం తీసుకోనుంది. కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి సామర్థ్యం ఉన్న ప్రైవేట్ పరిశ్రమల సహకారాన్ని కూడా పొందాలని యోచిస్తున్నట్లు జానయ్య తెలిపారు. ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేసేందుకు సుమారు రూ.25 కోట్ల నిధులు అవసరమవుతాయని విశ్వవిద్యాలయం అంచనా వేసింది. ఇందుకోసం సమగ్ర ప్రాజెక్టు ప్రతిపాదనను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. రైతు పొలాల్లోనే శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండి, ఆధునిక సాంకేతికతలను ప్రత్యక్షంగా అమలు చేయడం ద్వారా పరిశోధన ఫలితాలు క్షేత్రస్థాయికి చేరడంతో పాటు రైతుల ఆదాయం పెంపునకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని విశ్వవిద్యాలయం ఆశాభావం వ్యక్తం చేసింది.

# రెండోసారి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు..

## బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి భావనకు ఘన సన్మానం





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బాల్ బ్యాడ్మింటన్‌లో మణికొండకు చెందిన క్రీడాకారిణి భావన జాతీయ స్థాయిలో సత్తా చాటి ప్రతిష్టాత్మకమైన 'స్టార్ ఆఫ్ ఇండియా' ప్రత్యేక అవార్డును రెండోసారి సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తిలో నిర్వహించిన 72వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ మహిళల జట్టు తరఫున ప్రతిభ కనబరిచిన భావనకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. తెలంగాణ మహిళల జట్టు సభ్యులు రాధిక, అంజలి, ధనలక్ష్మి, దేవికలతో సమన్వయంతో భావన పోటీల్లో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. కఠోర శ్రమ, పట్టుదల, ఆటపై ఉన్న మక్కువతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మణికొండకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. భావన చిన్ననాటి నుంచే తన తండ్రి, అన్నయ్యను ఆదర్శంగా తీసుకుని బాల్ బ్యాడ్మింటన్ వైపు అడుగులు వేసింది. ఆమె తండ్రి సీతారామయ్య స్వయంగా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కాగా, సీనియర్ నేషనల్స్‌లోనూ పాల్గొన్నట్లు భావన తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం పొందిన సీతారామయ్య ప్రస్తుతం జమ్మలమడుగులో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తన తండ్రే తనకు తొలి గురువుగా నిలిచి బాల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇచ్చారని భావన పేర్కొన్నారు. ఆటపై తనకున్న ఆసక్తిని గుర్తించిన తండ్రి స్వయంగా శిక్షకుడిగా మారి జాతీయ స్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దారని తెలిపారు. తన అన్నయ్య కూడా క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందినట్లు ఆమె వివరించారు. భావన ఇప్పటికే సబ్‌జూనియర్ నేషనల్స్, జూనియర్ నేషనల్స్, సీనియర్ నేషనల్స్‌తో పాటు ఫెడరేషన్ కప్ వంటి ప్రతిష్టాత్మక పోటీల్లో పాల్గొంది. గతంలోనూ 'స్టార్ ఆఫ్ ఇండియా' అవార్డును సాధించిన ఆమె తాజాగా మరోసారి అదే ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకోవడం విశేషం. తన విజయానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పాటు స్థానిక గురువు, మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సహచర క్రీడాకారులు రామ్‌రెడ్డి, సాయిరాం ప్రసాద్, వినయ్ అందించిన శిక్షణ, సహకారం ఎంతో కీలకమని భావన తెలిపారు. తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భావన రెండోసారి ప్రతిష్టాత్మక స్టార్ ఆఫ్ ఇండియా ప్రత్యేక అవార్డు సాధించడంపై మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ నవీన్ కుమార్, సలహాదారు అందె లక్ష్మణరావు, సభ్యులు హరినాథ్‌రెడ్డి, టి. శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గార్వ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అతిథులుగా జర్మన్ టెన్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎన్‌ఎండీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరహరిశాస్త్రి, అగ్రికల్చర్ కమిటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి తదితరులు హాజరై భావనను అభినందించారు.

# కుమ్మర వృత్తిదారులకు ప్రభుత్వ అండగా నిలవాలి

**వృత్తిదారులకు ఉచిత బంకమట్టి అనుమతులు ఇచ్చి రవాణా సౌకర్యం కల్పించాలి**

**వృత్తిని నమ్ముకున్న వారికి ప్రభుత్వం మూడు ఎకరాలలో షెడ్లు ఏర్పాటు చేయాలి**

**ప్రజావాణిలో కలెక్టర్ ,బీసీ వెల్ఫేర్ కు వినతిపత్రం అందజేసిన కుమ్మర సంఘం నాయకులు**

**వనపర్తి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు సుగురు రాములు**



**వనపర్తి అక్టోబర్ 05 క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ కుమ్మర సంఘం అధ్యక్షుడు నడికుడి జయంత్ రావు, ప్రధాన కార్యదర్శి దయానంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, పిలుపుమేరకు సోమవారంవనపర్తి జిల్లా 15 మండలాల కుమ్మరులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారులు ప్రజావాణిలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మరియు బీసీ వెల్ఫేర్ ప్రమీల కు వినతి పత్రాలు అందజేశారు. కుమ్మర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి వెంటనే పరిష్కరించాలని వనపర్తి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు సుగురు రాములు అన్నారు, ఆయాయ మండలాల కుమ్మర వృత్తిదారులు ఎంపీడీవో, ఎమ్మార్వో లకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షులు సూగురు రాములు మాట్లాడుతూకుమ్మరి వృత్తిదారులకు ప్రధానంగా అవసరమైన బంకమట్టిని సేకరించడం, రవాణా చేసుకోవడం ప్రస్తుతం భారంగా మారిందని ఆయన అన్నారు,బంకమట్టిని ఉచితంగా అందించడంతో పాటు, దానిని గ్రామాలకు రవాణా చేసుకునేందుకు ప్రభుత్వం ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.అలాగే కుమ్మరి వృత్తిదారులు తయారు చేస్తున్న మట్టి కుండలు, ప్రమిదలు, దీపాలు, కూజాలు, మట్టి గణపతి విగ్రహాలు తదితర సంప్రదాయ వస్తువులకు ప్రభుత్వం జిల్లా కేంద్రంలో 3 ఎకరాల భూమిలో ప్రత్యేక మార్కెట్ షెడ్లను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి మండలానికి ఒక ఎకరా భూమిని ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, ప్రభుత్వ ప్రతి కార్యాలయంలో చల్ల నిలకుండలను ఏర్పాటు చేయాలన్నారు. కుమ్మర్లను కార్పొరేషన్ చైర్మన్ ను ఏర్పాటుచేసి వృత్తిదారులకు సంక్షేమ పథకాలు, అందేలా చేయాలని ఆయన తెలిపారు, మట్టితో తయారుచేసిన ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు. ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు మాట్లాడుతూ.తరతరాలుగా కుమ్మరి వృత్తిని కొనసాగిస్తూ పర్యావరణహితమైన మట్టి పాత్రలను ప్రజలకు అందిస్తున్న కుమ్మరి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని, ఆధునిక మార్కెట్ పరిస్థితుల్లో ప్లాస్టిక్, ఇతర ప్రత్యామ్నాయ వస్తువుల కారణంగా మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గడంతో కుమ్మరి కుటుంబాల జీవనోపాధిపై ఆధారపడి బతుకుతున్న వారిపై ప్రభావం పడుతోందన్నారు.కుమ్మరి వృత్తిని కాపాడటంతో పాటు యువత ఈ సంప్రదాయ వృత్తిలో కొనసాగేందుకు శిక్షణ, కార్యక్రమాలు. ఆర్థిక సహాయం,రుణ సదుపాయం, ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. గౌరవ సలహా దారులు బొడ్డుపల్లి నరసింహ. జిల్లా గౌరవ అధ్యక్షులు. సూర్యవంశం వెంకట స్వామి. కోశధికారి సూర్యవంశం శ్రీనివాసులు. జిల్లా యూత్ అధ్యక్షులు. సూర్యవంశం రామకృష్ణ. మండల అధ్యక్షులు. సూర్యవంశం శివ. మండల రూరల్ యూత్ అధ్యక్షులు విష్ణువర్ధన్. కుల బంధువులు. రామస్వామి.పెద్ద మన్యం. వెంకటేశ్వర్లు. లక్ష్మీనారాయణ. సురేష్. బొడ్డుపల్లి బాలరాజు.



# రాజేంద్రనగర్ సర్కిల్-19లో ప్రజావాణి..: దరఖాస్తులు నిల్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి కార్యాలయంలో నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎలాంటి దరఖాస్తులు అందలేదు. మొత్తం దరఖాస్తులు: నిల్గా నమోదయ్యాయి. ప్రజలు తమ పరిధిలోని సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారాలు పొందవచ్చని అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## బుద్వేల్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ ప్రారంభం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు చేపడుతున్న జల సంరక్షణ చర్యల్లో భాగంగా బుద్వేల్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌ను ప్రారంభించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బుద్వేల్ జెడ్‌పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతను ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఆధ్వర్యంలో జల సంరక్షణలో భాగంగా ఈ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌ను నిర్మించారు. వర్షాకాలంలో వృథాగా వెళ్లిపోయే నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించి భూగర్భ జలాలను రీచార్జ్ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయాలంటే ప్రతి ఒక్కరూ జల సంరక్షణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఇలాంటి ఇంకుడు గుంతల ఏర్పాటు విద్యార్థుల్లోనూ నీటి సంరక్షణపై అవగాహన పెంచుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ బరిలో సర్వోత్తమ్‌రెడ్డి గెలుపే లక్ష్యం

**పట్టభద్రుల ఓటు నమోదు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే బీఎల్ఆర్**

**కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం**

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, అక్టోబరు 5:** నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) పిలుపునిచ్చారు. సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్వోత్తమ్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రచారంపై చర్చించారు.నియోజకవర్గంలోని ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో మరింత విస్తృతం చేసి, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## వైరా మార్కెట్ యార్డులో పెసర పంట కొనుగోలు కార్యక్రమం ప్రారంభం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** వైరా మార్కెట్ యార్డులో పెసర పంట కొనుగోలు కార్యక్రమాన్ని వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ , వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన పెసర పంటకు సరైన ధర లభించేలా కొనుగోలు కేంద్రాల ద్వారా పంట కొనుగోలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, పంట నాణ్యత పరిశీలన, తూకం తదితర ప్రక్రియలను సక్రమంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన చెల్లింపులు రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారావు మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, పెసర పంట కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైరా మార్కెట్ యార్డులో పెసర పంట కొనుగోలు కార్యక్రమం ప్రారంభం కావడంతో స్థానిక రైతులకు తమ పంటను విక్రయించేందుకు మరింత సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ యార్డు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి.. ప్రజలే కరువు!

**రెండున్నర గంటలు ఎదురుచూసిన అధికారులు..**

**ఒక్క దరఖాస్తూ రాకపోవడంతో ఖాళీగా ముగిసిన కార్యక్రమం**




మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, అక్టోబరు 5: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణికి సోమవారం ప్రజలే కరువయ్యారు. సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు వస్తారని అధికారులు రెండున్నర గంటలపాటు ఎదురుచూసినా.. ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో కార్యక్రమం ఖాళీగానే ముగిసింది. మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అధికారులు సమయానికి హాజరై దరఖాస్తులు స్వీకరించేందుకు సిద్ధమయ్యారు. టేబుళ్లు, కుర్చీలు సిద్ధం.. అధికారులు సిద్ధం.. వినతులు స్వీకరించేందుకు ఏర్పాట్లు సిద్ధం.. కానీ సమస్యలు చెప్పుకునేందుకు మాత్రం ఒక్కరంటే ఒక్కరూ రాలేదు. దీంతో అధికారులు కొంతసేపు వేచి చూసి చివరకు కార్యక్రమాన్ని ముగించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణికి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మండలంలో సమస్యలే లేవా.. లేక ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన లేదా అన్నది ప్రశ్నగా మారింది. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన వేదిక.. చివరకు దరఖాస్తుల కోసం అధికారుల నిరీక్షణ వేదికగా మారింది. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో మాతంగి రమేష్, ఎంఈవో ధర్మానాయక్, మండల వ్యవసాయ అధికారి రుషేంద్రమణి, కార్యాలయ సూపరింటెండెంట్ కరుణాకర్, మండల పశు వైద్యాధికారి స్వప్న, హౌసింగ్ ఏఈ మణిదీప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, ఐకేపీ ఏపీఎం నిజముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నేలకు ఒరిగిన "నీలి నేత" డాక్టర్ యాదయ్య

- అంబేద్కర్ ఆశయాల కోసం జీవితాంతం పోరాటం
- పేదల వైద్యుడిగా.. బహుజన ఉద్యమకారుడిగా సేవలు
- రెండు రూపాయలకే పేదలకు వైద్యం
- సమతా సైనిక్ దళ్‌లో కీలక బాధ్యతలు
- "పే బ్యాక్ టు సొసైటీ.. గో బ్యాక్ టు విలేజ్" నినాదంతో సేవ
- అంబేద్కర్ చరిత్రపై లోతైన అధ్యయనం
- యాదయ్యతో అనుబంధం మరువలేనిది సాయమొల్ల చంద్రయ్య
- ఉద్యమ దీపం ఆరిపోయింది రుద్రారం శంకర్
- భవిష్యత్తు తరతరాలకు స్ఫూర్తిగా డాక్టర్ యాదయ్య జీవితం
- అంబేద్కర్ భావజాలానికి జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ యాదయ్యకు కన్నీటి వీడ్కోలు
- పేదల వైద్యుడిగా.. బహుజన ఉద్యమకారుడిగా.. గుర్తింపు
- అంబేద్కర్ ఆశయాల వారధిగా చిరస్మరణీయం

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05:** అంబేద్కర్ ఆలోచనలను జీవిత ధ్యేయంగా మలుచుకుని, వైద్యుడిగా పేదలకు సేవ చేస్తూనే బహుజన హక్కుల కోసం జీవితాంతం పోరాడిన డాక్టర్ డప్పు యాదయ్య (76) సోమవారం కన్నుమూశారు. గత మే నెలలో వడదెబ్బ కారణంగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో బహుజన ఉద్యమ వర్గాల్లో విషాదం నెలకొంది. పటాన్‌చెరులో బాలయ్య--సుశీల దంపతులకు జన్మించిన డాక్టర్ యాదయ్య కుటుంబంలో పెద్ద కుమారుడు. ఆయనకు ఇద్దరు అన్నలు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన సంతానం తమ తమ రంగాల్లో స్థిరపడింది. సామాజికంగా వెనుకబడిన పరిస్థితుల్లోనూ పటాన్‌చెరులో ఎస్సీ సామాజిక వర్గం నుంచి తొలితరం పదో తరగతి చదివిన వారిలో డాక్టర్ యాదయ్య ఒకరిగా నిలిచారు. ఇంజినీరింగ్‌పై ఆసక్తి



ఉన్నప్పటికీ గురువుల ప్రోత్సాహంతో ఇంటర్‌లో బైపీసీ చదివి వైద్య విద్య వైపు అడుగులు వేశారు. గాంధీ మెడికల్ కాలేజీలో 1973--75 బ్యాచ్‌లో వైద్య విద్యను అభ్యసించారు. ప్రభుత్వ ఉద్యోగం వైపు వెళ్లకుండా ప్రజాసేవనే మార్గంగా ఎంచుకున్న ఆయన 1975--76 ప్రాంతంలో కిష్టారెడ్డిపేటలో కేవలం రెండు రూపాయలకే పేదలకు వైద్యం అందిస్తూ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం చందానగర్‌లో సంధ్యా నర్సింగ్ హోమ్‌ను ప్రారంభించి వైద్య సేవలు అందించారు.

**అంబేద్కర్ భావజాలమే ఊపిరిగా..**

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలకు ఆకర్షితుడైన డాక్టర్ యాదయ్య ఆయన రచనలు విస్తృతంగా అధ్యయనం చేశారు. అంబేద్కర్ జీవించిన ప్రాంతాలు, ఆయన పర్యటించిన ప్రదేశాలు, పనిచేసిన ప్రాంతాలను స్వయంగా సందర్శించి చరిత్రను అధ్యయనం చేశారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక ప్రాంతాల్లో ఉపన్యాసాలు ఇచ్చారు. కులవివక్షకు వ్యతిరేకంగా ఆయన అనేక సందర్భాల్లో తన గళాన్ని వినిపించారు. పటాన్‌చెరు జిల్లా పరిషత్‌లో అంబేద్కర్‌కు అప్పట్లో అవమానం జరిగినట్టు డాక్టర్ యదయ్య కు కూడ జరిగింది. కులవివక్ష సంబంధించిన సంఘటనలను ఆయన తరచూ గుర్తుచేసేవారని సహచరులు తెలిపారు. బొజ్జతరకం ఎం. ప్రేమ్‌కుమార్, కె. నాగయ్య, జేబీ రాజు, గడ్డం వెంకటస్వామి, గద్దర్ తదితర బహుజన నాయకులతో కలిసి సామాజిక ఉద్యమాల్లో పనిచేశారు. బీహెచ్ఈఎల్ ఉద్యోగులతో కలిసి పేదల కోసం రెండు శాతం కేటాయింపు కోరుతూ ఉద్యమించారు. "పే బ్యాక్ టు సొసైటీ.. గో బ్యాక్ టు విలేజ్" అనే ఆలోచనతో సమాజానికి తిరిగి సేవ చేయాలనే సందేశాన్ని ముందుకు తీసుకెళ్లారు.

**సమతా సైనిక్ దళ్‌లో కీలక బాధ్యతలు**

1993లో ఆలిండియా సమతా సైనిక్ దళ్‌లో చేరిన డాక్టర్ యాదయ్య 1995 డిసెంబర్ నుంచి 1998 వరకు రెండుసార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2002 ఫిబ్రవరి 10 నుంచి 2005 డిసెంబర్ 25 వరకు ఆలిండియా సమతా సైనిక్ దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇప్పటికి కార్యవర్గ సభ్యుడిగా, సలహాదారుగా కూడా కొనసాగుతున్నారు. రమాబాయి అంబేద్కర్‌కు సంబంధించిన ప్రచురణలతో పాటు సమతా సైనిక్ దళ్ పోరాటం, చరిత్ర, లక్ష్యాలు, కార్యాచరణ, పరిచయం తదితర అంశాలపై వెలువడిన పుస్తకాలను ప్రజలకు ఉచితంగా అందించారు. కర్ణాటకకు చెందిన వి.టి. రాజశేఖర్ శెట్టి ఆధ్వర్యంలోని 'దళిత్ వాయిస్' పత్రికలోని విషయాలను ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదించి ప్రజలకు అందించారు. అనేక ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణల్లో పాల్గొన్నారు. మాదారం, కొడకంచి, సుల్తాన్‌పూర్ తదితర గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి అంబేద్కర్ యువతకు, విద్యావంతులకు ఇచ్చిన సందేశం, కుల నిర్మూలన, శవపరీక్ష తదితర అంశాలపై ఉపన్యాసాలు ఇచ్చారు. గుండ్ల మాచునూరు, బొర్పట్ల ప్రాంతాల్లో ఇటీవల కూడా ఆయన ప్రసంగించారు.

**"యాదయ్యతో అనుబంధం మరువలేనిది" --- సాయమొల్ల చంద్రయ్య**

డాక్టర్ యాదయ్యతో తనకున్న అనుబంధాన్ని ఆలిండియా సమతా సైనిక్ దళ్ మాజీ జాతీయ అధ్యక్షుడు సాయమొల్ల చంద్రయ్య గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ఆచరణలో పెట్టిన వ్యక్తిగా యాదయ్యతో కలిసి అనేక సామాజిక కార్యక్రమాల్లో పనిచేసిన రోజులను ఆయన స్మరించుకున్నారు. వైద్య వృత్తితో పాటు సమాజం పట్ల బాధ్యతను నిర్వర్తించిన యాదయ్య వంటి వ్యక్తి మరణం బహుజన సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

**"ఒక ఉద్యమ దీపం ఆరిపోయింది" --- రుద్రారం శంకర్**

డాక్టర్ యాదయ్య మృతికి రుద్రారం శంకర్ ఘన నివాళులు అర్పించారు. పేదలకు వైద్య సేవలు అందించడం నుంచి అంబేద్కర్ భావజాల ప్రచారం వరకు ఆయన సాగించిన జీవితం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. వ్యక్తిగత జీవితాన్ని మించి సమాజం కోసం ఆలోచించిన యాదయ్య ఇక లేరనే వార్త ఎంతో బాధ కలిగించిందని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. తన మనవడికి "ఆనంద్ వైభవ్" అనే పేరు పెట్టడం నుంచి తన కుటుంబాన్ని బౌద్ధ భావజాలం వైపు నడిపించడం వరకు అంబేద్కర్ ఆలోచనలపై తనకున్న నిబద్ధతను డాక్టర్ యాదయ్య చాటుకున్నారు. వైద్యుడిగా పేదలకు అండగా నిలిచి, ఉద్యమకారుడిగా సామాజిక న్యాయం కోసం పోరాడి, అంబేద్కర్ భావజాల ప్రచారకుడిగా తరతరాలకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన జీవితం ఇక జ్ఞాపకంగా మిగిలిపోయింది.

## అట్టహాసంగా కొలువుదీరిన ఖమ్మం రెడ్ క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా కమిటీ చైర్మన్ గా డాక్టర్ జి వెంకటేశ్వర్లు (డా.జీవీ), వైస్ చైర్మన్ గా కమర్తపు కిరణ్ కుమార్, ట్రెజరర్ గా యార్లగడ్డ రాఘవరావు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కొల్ల రవీందర్

**ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.**

తోలుత ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సమావేశం నిర్వహించి అనంతరం సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ చైర్మన్ డా. జీవీ, వైస్ చైర్మన్ కమర్తపు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజల సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఓటర్ల నమ్మకంతో ఖమ్మం జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ కి జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు మూడేళ్లపాటు ఈ నూతన కమిటీ బాధ్యతల్లో ఉంటుందని వారు తెలిపారు. కాగా మొదటి సంవత్సరం పాలకవర్గ కమిటీ చైర్మన్ గా డాక్టర్ జి వెంకటేశ్వర్లు, రెండవ సంవత్సరం కమిటీ చైర్మన్ గా డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, మూడవ సంవత్సరం కమిటీ చైర్మన్ గా డాక్టర్ ప్రదీప్ కుమార్ కూరపాటి బాధ్యతలలో ఉంటారని ఆయన స్పష్టం చేశారు.

**మాది పదవుల పంపకం కాదు...బాధ్యతల పంపకం..**

ఎంతో నమ్మకంతో మాకు ఓటు వేసి గెలిపించిన వారికి, ఈ జిల్లా ప్రజలకు మా కమిటీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని నూతన కమిటీ చైర్మన్ డా.జీవీ స్పష్టం చేశారు. మాది పదవులు పంపకాల కోసం చేసే ఆరాటం కాదని, రెడ్ క్రాస్ సొసైటీని తమ సేవలతో



అత్యున్నత శిఖరం వైపు నడిచేందుకు బాధ్యతలను మాత్రం పంచుకున్నామని వారు తెలిపారు. ఇందుకు సంబంధించి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**అట్టహాసంగా కొలువుదీరిన పాలకవర్గం**

ఖమ్మం రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించిన ఖమ్మం సర్వీస్ ఫ్రంట్ సోమవారం రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో లాంచనంగా కొలువుదిరింది.

ఇందుకు సంబంధించి సోమవారం సాయంత్రం ఖమ్మంలోని రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఖమ్మం జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల అధికారి గా శ్రీనివాసరావు గారి సమక్షంలో పాలకవర్గం మొదటి సమావేశం నిర్వహించడం తోపాటు ప్రమాణ స్వీకారాన్ని పూర్తి చేయించారు. దీనిలో భాగంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అనంతరం ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఖమ్మం రెడ్ క్రాస్ సొసైటీ నూతన చైర్మన్గా డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్ గా సమర్థపు కిరణ్ కుమార్ జిల్లా ట్రెజరర్ గా యార్లగడ్డ రాఘవ స్టేట్ కమిటీ మెంబర్ గా కొల్లా రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఫౌండర్ మెంబర్ కూరపాటి వెంకటేశ్వర్లుకు ఘనంగా సన్మానం చేశారు. ఎన్నికైన వారంతా వారి బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ప్రమాణస్వీకారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ మా కమిటీపై అత్యంత విశ్వాసం ఉంచి గెలిపించినటువంటి ఖమ్మం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఓటర్లకు అండగా నిలిచిన మిత్రులకు స్నేహితులకు మీడియాకు జిల్లా ప్రజలకు తమ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ సందర్భంగా పలువురు పాలకవర్గం సభ్యులను వారి శ్రేయోభిలాషులు బంధువులు స్నేహితులు అన్ని వర్గాల ప్రజలు ఘనంగా శాలువలతో పూలదండలతో సత్కరించారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందంకు ఘన సన్మానం

**శివానందం సేవలను కొనియాడిన స్థానిక ప్రముఖులు**

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందంను స్థానిక ప్రముఖులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివానందం చేస్తున్న ప్రజా సేవలు, మార్కెట్ కమిటీ అభివృద్ధికి చేస్తున్న కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోమరగూడెం శంకర్, మాజీ వార్డు సభ్యులు డప్పు యాదయ్య, ఎస్సీఆర్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టోళ్ల వెంకటేష్, ఎంఎస్పీ సీనియర్ నాయకులు కొంగెరి క్రిష్ణ, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సమ్మయ్య, వ్యాపారులు ఉమర్ భాయ్, లఖాన్ భాయ్, ఎస్‌కే యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు. శివానందం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.